teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 272 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 7 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## పీఈ సెట్, ఎడ్ సెట్ షెడ్యూల్ విడుదల

### మార్చి 12న పీఈ సెట్ నోటిఫికేషన్‌న జారీ

### మార్చి 15 నుంచి మే 24 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పీఈ సెట్, ఎడ్ సెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. మార్చి 12న పీఈ సెట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మార్చి 15 నుంచి మే 24 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అపరాధ రుసుంతో మే 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. జూన్ 11 నుంచి 14 వరకు తెలంగాణ పీఈ సెట్ పరీక్షలు జరగనున్నాయి. తెలంగాణ ఎడ్‌సెట్ నోటిఫికేషన్‌ను కాకతీయ యూనివర్శిటీ విడుదల చేసింది. మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 12 నుంచి మే 13 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు యూనివర్శిటీ వెల్లడించింది. జూన్ 1న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు.



## కాంగ్రెస్ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ లేఖ

బీసీ కులగణన విజయవంతం గూర్చి స్పష్టం

.. వివరాలు 2లో



## రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల హడావిడి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు

అవకతవకలు అవకాశం లేకుండా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు

.. వివరాలు 2లో



## చంద్రయాన్ -4 మిషన్‌ను ప్రారంభించనున్న భారత్

చంద్రుని ఉపరితలం నుంచి నమూనా సేకరించడమే లక్ష్యం

సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

.. వివరాలు 2లో



# 42 ఏళ్ల తర్వాత కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం

### మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హెూమాలు

భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం

భక్తుల కోసం ప్రత్యేక బస్సులు, అన్నదాన ఏర్పాట్లు

కాళేశ్వరం క్షేత్రంలో భారీ బందోబస్తు

ఈ మేరకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయంలో 42 ఏళ్ల తర్వాత అరుదైన కార్యక్రమం జరగబోతోంది. రుత్వికులు ఇక్కడ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమం ఫిబ్రవరి 7 నుండి మూడు రోజుల పాటు కొనసాగనుంది. మహా కుంభాభిషేకం కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. స్థానికంగా ఉన్న పండితులతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వేద పండితులను కాళేశ్వరానికి తీసుకొచ్చి ఆలయ రూపురేఖలు మార్చేశారు. ఆ తర్వాత 1982లో శృంగేరీ పీఠాధిపతి కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ఆలయంలో కుంభాభిషేకం కార్యక్రమం జరపలేదని కాళేశ్వర దేవస్థానం చరిత్రలో మహా కుంభాభిషేకం ఒక మైలురాయిగా నిలువనుంది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని ఆశిస్తున్నారు.

02




కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు. ఈ మహా కుంభాభిషేకం కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. 42 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.



## తీన్మార్ మల్లన్నకు వారం రోజుల డెడ్ లైన్

కులగణన నివేదిక తగలబెట్టడంపై క్రమశిక్షణ కమిటీ సీరియస్

విమర్శలు చేయడంపై వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీస్



హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): తీన్మార్ మల్లన్నకు వారం రోజుల డెడ్ లైన్ విధించింది పీసీసీ క్రమశిక్షణ కమిటీ. కులగణనపై ఇష్టారీతిన మాట్లాడటం, నివేదికను తగలబెట్టడాన్ని సీరియస్‌గా తీసుకుంది కాంగ్రెస్ పార్టీ. పార్టీ లైన్ దాటి మాట్లాడటం,

మిగతా 2 లో



## టెన్త్ ప్రశ్నాపత్రాలపై సీక్రెట్ సెక్యూరిటీ కోడ్

లీక్ చేస్తే గంటల వ్యవధిలోనే పట్టుకునే అవకాశం

పది పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న వేళ ఏర్పాట్లు

పేపర్ లీకేజీలు అరికట్టుటకు అధికారుల పటిష్ట చర్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయి. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. అనంతరం మార్చి 21 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయి. అయితే పబ్లిక్ పరీక్షల సమయంలో యేటా పేపర్ లీకేజీలు అధికారులకు

మిగతా 2 లో



## ముగిసిన సీఎల్పీ సమావేశం

సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రకటన

పార్టీ లైన్ దాటుతున్న నేతలపై సమావేశంలో చర్చ

నిర్ణయాలను వ్యతిరేకిస్తే కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం

హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీఎల్పీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రకటించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ఇటీవల పార్టీ లైన్ దాటుతున్న నేతల అంశంపై సీఎల్పీలో సమావేశంలో చర్చించారు. అనంతరం ఎవరైనా నేతలు కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను

మిగతా 2 లో

## ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎంపీతో మంత్రి సీతక్క సీఎంతో భేటీ

ఆదివాసీ, గిరిజనుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ఎస్టీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీతో కలిసి మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం

మిగతా 2 లో






## ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంపుకు కొత్త విధానాలు

రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఈటో మోటార్స్ నుంచి ప్రారంభమైన ఫ్లిక్స్, ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు

పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ రాష్ట్రంలో రవాణా వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచడం కోసం కొత్త విధానాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఐటీసీ కాకతీయ హెూటల్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈటో మోటార్స్ నుంచి ఫ్లిక్స్ బస్, ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని ఈవీ పాలసీ ప్రకారం, రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ 2026 డిసెంబర్ 31 వరకు మినహాయింపు ఇచ్చినట్లు మంత్రి ప్రకటించారు. ఈ విధానం వల్ల కాలుష్యాన్ని

మిగతా 2 లో

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కేఏ పాల్ వార్నింగ్



ఎవరితో పెట్టుకున్నా “ట్రంప్” భారతీయులతో పెట్టుకోవద్దు

భారతీయుల కోసం నేను ఏమైనా చేస్తా

దేశ పౌరులకు ట్రంప్ బేడీలు వేస్తుంటే మోడీ ఏం చేస్తున్నారు

.. వివరాలు 2లో

## పార్టీ మారిన వారిపైన కేసును ఫాలో అప్ చేస్తాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

ఎమ్మెల్యేలపైన వేటుపడేలా కొట్లాడుతామని వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): పార్టీ మారిన వారిపైన పార్టీ తరఫున వేసిన కేసును కూడా గురువారం ఫాలో అప్ చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు మా పార్టీ నేతల బృందం న్యాయవాదులతో సమావేశమవుతుందని వెల్లడించారు. ఖచ్చితంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన వేటుపడేలా కోర్టులో కొట్లాడుతామని వెల్లడించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నితిన్ గడ్కరీ లను

మిగతా 2 లో





## ఈనెల 12న జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఈసీ వీడియో కాన్ఫరెన్స్

స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షా

.. వివరాలు 2లో

# 42 ఏళ్ల తర్వాత కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం





తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయంలో అరుదైన కార్యక్రమం జరగబోతోంది. 42 ఏళ్ల తర్వాత ఇక్కడ రుత్వికులు కుంభాభిషేకం నిర్వహించబోతున్నారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. 1982 తర్వాత ఈ అరుదైన కార్యక్రమాన్ని కాళేశ్వరంలో నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు సన్నాహాలు చేశారు. ఇవి తపోవన పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో శతచండీ మహారుద్ర సహిత, సహస్ర ఘటాభిషేకం, కుంభాభిషేకం నిర్వహించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో ఉన్న ఈ ఆలయానికి గోదావరి అవతల మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా విస్తరించి ఉండగా మరోవైపున మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఉంది. దీంతో ఈ కుంభాభిషేకానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంది. దట్టమైన అడవిలో ఉన్న ఈ ఆలయాన్ని సందర్శించేందుకు కాలి బాటన, ఎడ్ల బండ్లపై వెళ్లేవారు. 1970లో కాళేశ్వరంలోని కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి ఆలయ రూపురేఖలు మారిపోయాయి. శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని వెలుగులోకి తీసుకురావాలని శృంగేరి పీఠాధిపతి సంకల్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎమ్మెల్యే జువ్వాడి చొక్కారావును శృంగేరి పీఠాధిపతి పిలిపించుకుని క్షేత్ర ప్రాముఖ్యతను వివరించి ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అప్పగించారు. రోడ్డు కూడా లేని కాళేశ్వరానికి రోడ్డు సౌకర్యం కల్పించారు. స్థానికంగా ఉన్న పండితులతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వేద పండితులను కాళేశ్వరానికి తీసుకొచ్చి ఆలయ రూపురేఖలు మార్చేశారు. ఆ తర్వాత 1982లో శృంగేరీ పీఠాధిపతి కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ఆలయంలో కుంభాభిషేకం కార్యక్రమం జరుపలేదని కాళేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు పనకంటి నగేష్ శర్మ తెలిపారు. 42 ఏళ్ల తర్వాత ఈ కుంభాభిషేకానికి శ్రీకారం చుట్టిన దేవాదాయ శాఖ అధికారులు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మే నెలలో ప్రాణహిత పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ముందుగా కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గోదావరి నది ఒడ్డున వెలిసిన ఈ ఆలయ సమీపంలోనే మహారాష్ట్ర మీదుగా వస్తున్న ప్రాణహిత నది గోదావరి నదిలో కలుస్తోంది. ఇక్కడే అంతర్వాహినిగా సరస్వతి నది కలుస్తోందని చరిత్ర చెబుతోంది. మూడు నదుల సంగమంగా భాసిల్లుతున్న ఈ క్షేత్రంలో మూడు నదులకు పుష్కరాలు జరిపించి ఆనవాయితీ కొనసాగుతోంది. అయితే 7వ తేదీన ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక కుంభాభిషేకం కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులతో పాటు, కాళేశ్వరం క్షేత్రంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## చంద్రయాన్ -4 మిషన్‌ను ప్రారంభించనున్న భారత్



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): చంద్రుని ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా 2027లో భారత్ చంద్రయాన్ -4 మిషన్‌ను ప్రారంభించనుందని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ మీడియాకు వెల్లడించారు. చంద్రయాన్-4 మిషన్ లో ఎల్వీఎం-3 రాకెట్ కు సంబంధించి రెండు వేర్వేరు ప్రయోగాలు ఉంటాయని ఈ మిషన్ లో ఐదు వేర్వేరు పరికరాలను మోసుకెళ్లి కక్ష్యలో సమీకరించబడతాయని చెప్పారు. అలాగే 2026లోనే గగన్ యాన్ మిషన్ లో భారత వ్యోమగాములను ప్రత్యేకంగా రూపొందించిన అంతరిక్ష నౌకలో భూమి దిగువ కక్ష్యకు పంపించి సురక్షితంగా తిరిగి తీసుకురావడం జరుగుతుందని జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఇందులో రోబోట్ వ్యోమ్ మిత్రను సైతం పంపనున్నట్లు పేర్కొన్నారు. 2026లోనే భారత్ సముద్రయాన్ ప్రయోగం కూడా నిర్వహిస్తుందన్నారు. ఈ ప్రయోగంలో భాగంగా ముగ్గురు శాస్త్రవేత్తలను జలాంతర్గామిలో 6,000 మీటర్ల లోతుకు తీసుకెళ్తారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సముద్రయాన్ మిషన్ గురించి ప్రసంగించిన సంగతి తెలిసిందేనని గుర్తు చేశారు. దేశ ఆర్థిక వృద్ధి కోసం సముద్ర గర్భంలోని కీలకమైన ఖనిజాలు, అరుదైన లోహాలు, సముద్ర జీవ వైవిధ్యం వంటి విస్తారమైన వనరులను గుర్తించడంలో ఈ మిషన్ ప్రాముఖ్యత గురించి కేంద్ర మంత్రి చెప్పారు. త్వరలోనే భారత్ స్పేస్ సెక్టార్ లో సూపర్ పవర్ గా ఎదగబోతుందన్నారు. భారతదేశ స్పేస్ ఎకానమీ ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల విలువ ఉందని వచ్చే దశాబ్దం నాటికి 44 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపారు. గత పదేళ్లకాలంలో భారత అంతరిక్ష రంగం మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు విస్తరించినట్లు పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం భారీ రాకెట్లను నింగిలోకి పంపేందుకు వీలుగా మూడో లాంచ్ ప్యాడ్ ను శ్రీహరికోటలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇస్రోని 1969 స్థాపించగా 1993 వరకు తొలి లాంచ్ ప్యాడ్ ను స్థాపించేందుకు రెండు దశాబ్దాలకుపైగా సమయం పట్టిందన్నారు. రెండో లాంచ్ ప్యాడ్ ను 2004లో నిర్మించారని, అందుకు మరో దశాబ్దం పట్టిందన్నారు. చిన్న ఉపగ్రహాల కోసం తమిళనాడులోని టుటికోరిన్ జిల్లాలో కొత్త ప్రయోగ వేదిక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శ్రీహరికోట స్పేస్ సెంటర్ ను విస్తరిస్తున్నట్లు తెలిపారు.

## ముగిసిన సీఎల్పీ సమావేశం

మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకిస్తే కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. అలాగే పార్టీ విధానాలపై ఎవరికైన అనుమానాలు ఉంటే అంతర్గతంగా చర్చించాలని ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేతలు సూచించినట్లు తెలుస్తోంది. అంతకు ముందు స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యచరణపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే లకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై కీలకంగా చర్చించారు. ఈ రెండు చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. అలాగే బీసీ కులగణన తో పాటు ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై రెండు భారీ బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించారు. ఈ సభలకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ లను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది ఉదయం 11 గంటలకు ప్రారంభం అయిన ఈ సీఎల్పీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది.

## పార్టీ మారిన వారిపైన కేసును ఫాలో అప్ చేస్తాం

మొదటి పేజీ తరువాయి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ నేతలు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దేశ పౌరులు విజయవంతంగా తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారంటే దానికి ప్రధాన కారణం దేశంలోని యూనివర్సిటీలే అని చెప్పారు. దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధితో పాటు అనేక ప్రైవేట్ విద్యా సంస్థలు, యూనివర్సిటీలు ఐఐటీ వంటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యా సంస్థలు కూడా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గురువారం యూజీసీ నిబంధనలో తేవాలనుకుంటున్న మార్పులపైన మా పార్టీ డిమాండ్లను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి తెలియజేశామని వెల్లడించారు. దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్ర పరిధిలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ నియామకానికి వేసే సర్చ్ కమిటీలకు బాధ్యతను పూర్తిగా రాష్ట్ర గవర్నర్‌కు అప్పగిస్తూ కేంద్రం తీసుకురానున్న యూజీసీ నిబంధనలపైన ధర్మేంద్ర ప్రధాన్‌కి కూలంకషంగా వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన అధీనంలోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలియజేసినట్లు వెల్లడించారు. నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్ అనే ఒక నిబంధనను తీసుకురావడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారం కాకుండా అభ్యర్థులు దొరకలేదని సాకుతో ఆ ఉద్యోగాలు ఇతర కేటగిరీలను భర్తీ చేసే ప్రమాదం ఉందన్నారు. ఇది ఆయా సామాజిక వర్గాలకు ఇచ్చిన రాజ్యాంగబద్ధమైన హక్కును హరించడమేనని తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగాల భర్తీలో కేవలం విద్యార్హతలపైన మాత్రమే కాకుండా పరిశోధనలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని హక్కులను హరించకుండా యూజీసీ నూతన నిబంధనలను రూపొందించాలని కోరినట్లు స్పష్టం చేశారు.

### మిడ్ మానేరుపై రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విజ్ఞప్తి మేరకు మా పార్టీ తరఫున సిరిసిల్ల వరకు నిర్మాణమవుతున్న జాతీయ రహదారి 365-బీని వేములవాడ నుంచి కోరుట్ల వరకు విస్తరించాలని ఈ రోజు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిసినట్లు వెల్లడించారు. మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిను ఏర్పాటు చేసి వేములవాడ మీదుగా కోరుట్లలో జాతీయ రహదారిని 63 కలిపేలా విస్తరించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.

## టెన్త్ ప్రశ్నాపత్రాలపై సీక్రెట్ సెక్యూరిటీ కోడ్

మొదటి పేజీ తరువాయి



తలనొప్పిగా మారాయి. అయితే ఈ సారి మాత్రం పేపర్ లీకేజీలకు తావులేకుండా వీటిని అరికట్టేందుకు విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా తొలిసారిగా టెన్త్ ప్రశ్నాపత్రాలపై సీక్రెట్ సెక్యూరిటీ కోడ్‌ను ముద్రించనుంది. ఈ మేరకు పరీక్షల కోసం రూపొందించిన అన్ని ప్రశ్నాపత్రాల్లో ఈ సీక్రెట్ సెక్యూరిటీ కోడ్‌ను ముద్రించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టనుంది. ఈ కోడ్ ద్వారా ఎక్కడైనా పేపర్‌ను లీక్ చేస్తే గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే దీనికి సంబంధించి కార్యచరణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా పదో తరగతి పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5.1 లక్షల మంది విద్యార్థులు పదో తగరతి పరీక్షలు రాయనున్నారు. అలాగే పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోనుంది. గతంలో కొందరు ఇన్విజిలేటర్లు పదో తరగతి పేపర్లను లీక్ చేయడం, వాట్సాప్‌లో షేర్ చేయడం వంటి సందర్భాలు పలుమార్లు చోటు చేసుకున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడినట్లు తేలితే వారిని కేవలం సస్పెన్షన్‌లతో సరిపెట్టకుండా ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించనున్నట్లు హెచ్చరించింది. టీచర్లు సైతం ఇలాంటి చర్యలకు సాహసించేది లేదని విద్యాశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

### ఈసారి టెన్త్ పరీక్షల్లో ఏయే మార్పులుంటాయంటే

2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మొత్తం 24 పేజీల బుక్‌లెట్‌ను అందించనున్నారు. గతంలో విడిగా పేపర్లు ఇచ్చేవారు. ఆన్సర్లు రాసిన పేపర్లన్నింటినీ కూర్చి, దారం కట్టాల్సి వచ్చేది. ఇక నుంచి కేవలం బుక్‌లెట్ మాత్రమే ఇవ్వనున్నారు.

అలాగే ఈ ఏడాది నుంచి గ్రేడింగ్ విధానానికి స్వస్తి చెప్పనున్నారు. గ్రేడ్లకు బదులు విద్యార్థులకు కేవలం మార్కులు మాత్రమే ఇస్తారు. అంటే ఇంటర్నల్స్, థియరీ పరీక్షల మార్కులను కలిపి మొత్తం మార్కులేస్తారన్నమాట.

ఇక పదో తరగతిలో ఇంటర్నల్ మార్కుల విధానం కూడా కేవలం ఈ ఏడాది మాత్రమే ఉంటుంది. 2025- 26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్నల్ మార్కులు ఉండవు. మొత్తం 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గతేడాది నుంచి ఆరు పేపర్లకుగాను ఏడు రోజులపాటు పరీక్షలను నిర్వహిస్తున్నారు. సైన్స్‌లో జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పేపర్లకు రెండు రోజుల పాటు పరీక్షలను నిర్వహించేవారు. పదో తరగతి మెమోలపై పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పెన్)ను ముద్రిస్తారు. ఆధార్ ఎలాగో విద్యార్థులకు ఈ పెన్ నంబర్ కూడా అలాగే పనిచేస్తుంది.

## ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎంపీతో మంత్రి సీతక్క సీఎంతో భేటీ

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎంను కోరారు. అంతేగాక ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు, బోరుబావులు, విద్యుత్తు, పోడుభూముల సమస్యలను పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇక ఈ కార్యక్రమంలో సీతక్కతో పాటు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తో పాటు ఆదివాసీ, గిరిజన నియోజకవర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని మంత్రి సీతక్క ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. ఈ సమావేశంపై ఆమె ఆదివాసీ మరియు గిరిజనుల సంక్షేమం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ఎస్టీ నియోజక వర్గాల ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలను సీఎంకి వివరించామని తెలిపారు. అలాగే గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, విద్యా, ఆరోగ్య రంగాల్లో చేపట్టాల్సిన చర్యలపై సీఎం సహకారం కోరామని అన్నారు. దీనికై ముఖ్యమంత్రి సుముఖంగా స్పందించారని అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కాగా అంతకుముందు మాసాబ్ ట్యాంక్ లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్ లో మంత్రి సీతక్క నేతృత్వంలో ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమాన్ని బలోపేతం చేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని మంత్రి సీతక్క తెలిపారు. గత పది సంవత్సరాల్లో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, గత ప్రభుత్వం పోడు సమస్యలను పట్టించుకోలేదని, ఐటీడీఏలను బలహీనపరిచిందని అన్నారు. ఇక ఇందిరా జలప్రభ వంటి పథకాలకు నీళ్లు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని, 10ఏళ్లలో ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పారు. గిరిజన ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, సమావేశంలో ఎస్టీ ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి నివేదిస్తామని తెలిపారు.

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కేఏ పాల్ వార్నింగ్



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వార్నింగ్ ఇచ్చారు. గురువారం పాల్ మీడియాతో మాట్లాడారు. తాను భారతీయుల కోసం నేను ఏమైనా చేస్తాను. ఎవరితో పెట్టుకున్నా ట్రంప్ భారతీయులతో పెట్టుకోవద్దు. ట్రంప్ నాకు మిత్రుడు కాబట్టి ముందు సూచన చేస్తున్నా అని కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశ పౌరులకు ట్రంప్ బేడీలు వేస్తుంటే మోడీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారిని ఆ విధంగా చూడటానికి వారు ఉగ్రవాదులా? రేపిస్టులా? అని అన్నారు. దమ్ముంటే మోడీ అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాలి, విదేశాంగా మంత్రి జయశంకర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చైనాను ఎదురించడానికి అమెరికాకు మన సహకారం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు మోడీని తిట్టిన చంద్రబాబు ఇప్పుడు తెగ పొగుడుతున్నాడని విమర్శించారు. అమెరికాలో ఇంత జరుగుతుంటే మన ఎంపీలు ఏమి చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అమెరికాలో ఇబ్బందులు పడుతున్న భారతీయులంతా కేఏ పాల్ వెబ్‌సైట్‌ను సంప్రదించండి అని పిలుపునిచ్చారు. అమెరికాలో భారతీయులకు ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. రేవంత్ ప్రభుత్వంపైనా కేఏ పాల్ విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ గలాన్ని విప్పాలని సూచించారు. రేవంత్ ప్రభుత్వం తెలంగాణను దోచుకుంటోందని ఆరోపించారు.

## తీన్మార్ మల్లన్నకు వారం రోజుల డెడ్ లైన్



మొదటి పేజీ తరువాయి

కులగణనపై తీవ్ర విమర్శలు చేయడంపై వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసులు ఇచ్చింది పీసీసీ క్రమశిక్షణ కమిటీ. ఈ నెల 12లోగా రిప్లై ఇవ్వాలని ఆదేశించింది. దేశంలోనే మొదటిసారి కులగణన చేసిన పార్టీగా రికార్డ్ సృష్టించామని, ముఖ్యమంత్రి రేవంత్ దీనిపై అసెంబ్లీలో ప్రకటన కూడా చేశారని కాంగ్రెస్ చెప్తుంది. పార్టీ ప్రజా ప్రతినిధిగా ఎమ్మెల్సీ హోదాలో ఉండి పార్టీ నాయకత్వం, ప్రభుత్వం నిర్వహించిన సర్వేపై విమర్శలు చేయడం కరెక్ట్ కాదన్నది. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ బీఫామ్ ఇచ్చి గెలిపిస్తే.. ఈ విధంగా ప్రవర్తించడం బాగోలేదని.. పార్టీ నామ్స్ అండ్ గైడ్‌లైన్స్ పాటించనందుకు వారంలో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు. వరంగల్ సభలో ఒక కులాన్ని దూషిస్తూ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షి. వివరణ ఇచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ కులగణన సర్వేతో పాటు.. ఒక వర్గాన్ని టార్గెట్ చేసి విమర్శలు చేస్తున్న తీన్మార్ మల్లన్న.. కాంగ్రెస్ షోకాజ్ నోటీసులకు ఏ విధంగా బదులిస్తారో చూడాలి.

## కాంగ్రెస్ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ లేఖ

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం లేఖ రాశారు. ఇందులో ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనను విజయవంతంగా చేపట్టిందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీల హక్కులను పరిరక్షించేందుకు, వారికి మరింత న్యాయం జరిగేలా ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీసీ కులగణనను కార్యరూపంలోకి తెచ్చేందుకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కీలకంగా పనిచేశారని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కట్టుబడి ఉందని, కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపరిచిన ప్రకటనల ప్రకారం ఈ బీసీ సర్వేను విజయవంతంగా అమలు చేయడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఈ మొత్తం ప్రక్రియలో ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలిచిందని, పార్టీ అధినేతలు అందించిన సహాయ సహకారాలతోనే ఈ భారీ సర్వే చేపట్టగలిగామని కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. బీసీ ప్రజలకు ఈ సర్వే ద్వారా మరింత న్యాయం చేయడానికి అవకాశం లభిస్తుందని, వారి సంక్షేమానికి ఇది ఓ కీలక ముందడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన కొండా సురేఖ, ఈ సర్వే విజయవంతం చేయడంలో సహకరించిన ఏఐసీసీ అగ్రనేతలకు వేర్వేరుగా లేఖలు రాశారు. రాష్ట్రంలో బీసీ సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న ఈ చర్యలు బలమైన ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల హడావిడి





తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఇంటర్ పరీక్షల హడావిడి మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఇంటర్ బోర్డు పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలను కొన్ని ప్రైవేటు కాలేజీలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఇప్పటికే 417 కాలేజీల్లో అద్దెకు సీసీ కెమెరాలు తీసుకున్నారు. కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో ఇప్పటికే కెమెరాలున్నాయి. దీంతో స్వల్ప సంఖ్యలో కాలేజీలు సీసీ కెమెరాల ఏర్పాటును వ్యతిరేకిస్తే వాటికి పరీక్ష కేంద్రాలు ఇవ్వబోమని బోర్డు అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్ బోర్డులో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రాక్టికల్ జరిగే ఎగ్జామ్ సెంటర్ లకు కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ప్రాక్టికల్ సెంటర్ లో సీసీ కెమెరా ఏర్పాటు చేశామని, అక్రమాలు జరగకుండా, అపోహలు తొలగించడం కోసం సీసీ కెమెరా లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. థియరీ ఎగ్జామ్స్ లో కూడా సీసీ కెమెరాలు ఉంటాయని కృష్ణ ఆదిత్య తెలిపారు. 90 శాతం సెంటర్ లలో సీసీ కెమెరా లు ఏర్పాటు చేశామని, ఎవరైనా విద్యార్థులు గైర్హాజరు అయిన సరిఅయిన కారణాలు చూపితే ప్రాక్టికల్స్ కి అనుమతి ఇస్తున్నామన్నారు. అన్ని సెంటర్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, కాలేజీలు సహకరిస్తున్నాయని ఆయన తెలిపారు. థియరీ ఎగ్జామ్ సమయంలో పేపర్ ఓపెన్ చేసే రూం లో, సెంటర్ ఎంట్రన్స్ లో, కారిడార్ లో, గ్రౌండ్ లో సీసీ కెమెరా లు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

## ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంపుకు కొత్త విధానాలు

మొదటి పేజీ తరువాయి

తగ్గించడం, నగరంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈటో మోటార్స్ ఫ్లిక్స్ బస్ ఎలక్ట్రిక్ బస్సును మొదటిసారి తెలంగాణలో ప్రారంభించడం, రాష్ట్రంలో పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్న కొత్త చర్యలకు నిదర్శనమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లుగా నగరంలోని ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చాలని, ఇతర వాహనాలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడంలో ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. వాహన సంస్థలు, వాహనదారులు రవాణా శాఖకి సంబంధించిన అన్ని నిబంధనలను పాటించాలని ఈవీ బస్సుల వినియోగం పెరిగితే, భవిష్యత్తులో మరిన్ని రకాల ఈవీ బస్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కులగణనపై అనుమానాల నివృత్తికి బలహీన వర్గాల బిడ్డగా బీసీ సంఘాలతో సమావేశానికి నేను సిద్ధమని, అందుకు రోడ్ మ్యాప్ ఇవ్వండని తెలిపారు. పార్టీ ఆలోచన అధికారుల పని తీరు మాకు తెలుసునని, ప్రజలను కన్ఫ్యూజ్ చేయకండని అన్నారు. కుల గణన మొదటి సారి చేసిందని దానికి న్యాయం జరగడానికి ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మా ఆలోచన, బలహీన వర్గాలకు న్యాయంచేయడమే అని పొన్నం స్పష్టం చేశారు.

## ఈనెల 12న జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఈసీ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై ఈనెల 12న జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేసింది. ఇప్పటి వరకు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్లను అడిగి తెలుసుకోనుంది. ఇప్పటికే మున్సిపాలిటీలో విలీనం చేసిన గ్రామ పంచాయతీ ఓటర్లను గ్రామపంచాయతీల నుండి తొలగించాలని ఎన్నికల సంఘం సూచించిన నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా రిటర్నింగ్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్నికల సంఘం శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొంది.

# పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం

**కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా కేంద్ర బడ్జెట్**

**కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్న బీజెపి**

**ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం**

**10న ఇందిరాపార్క్ వద్ద ప్రజా సంఘాలతో ధర్నా**

**సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి**






సూర్యాపేట, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమైనదని, కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా ఉందని, పేదలకు ఇస్తున్న సబ్సిడీలకు కోతలు పెట్టి, కార్పొరేట్ శక్తులకు సబ్సిడీలు ఇచ్చే విధంగా ఉందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. గురువారం సూర్యాపేట జిల్లా పాలకీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి పదివేల కోట్ల కోతలు, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచకపోవడం, ప్రైవేటీకరణకు పెద్దపీట వేశారని, మహిళలకు, పేదల అభివృద్ధికి బడ్జెట్లో కేటాయింపులు లేవని మండిపడ్డారు. ఒక కోటి 85 లక్షల కోట్ల అప్పులు చేసి, పెద్ద ఎత్తున వడ్డీల భారం మోపుతూ, ప్రజలపై పన్నుల మీద పన్నులు వేస్తూ సంపన్నులు, కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తుందని బిజెపి ప్రభుత్వంపై మండిపడ్డారు. పేదలకు నివాస గృహాలు లేవు, విద్య, వైద్య సౌకర్యాలు లేవు, ఉపాధి అవకాశాలు లేక కూలీలు గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పోతున్నారని, రైతుల ఆత్మహత్యలు రోజురోజుకీ పెరుగుతున్నా మోడీకి పట్టవని ఎద్దేవా చేశారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం దాటినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని ఘాటుగా విమర్శించారు. పేదలకు ఇస్తానన్న ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకం, రైతు భరోసా, రేషన్ కార్డులు, పోడు భూములకు పట్టాలు, నిరుద్యోగ కల్పన, తదితర అనేక హామీలను ఎక్కడ పూర్తిగా అమలు చేయలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, పాలకవర్గం హామీలను అమలు చేయడానికి ప్రభుత్వానికి ఆదాయం లేదంటున్నారు, ఆ విషయం ప్రజలకు హామీలు ఇచ్చేటప్పుడు తెలువదా అని ప్రశ్నించారు. ఈనెల 10వ తారీఖున ఇందిరాపార్క్ వద్ద ప్రజా సంఘాలతో పెద్ద ఎత్తున మహా ధర్నా చేపడుతున్నామని, దాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. మాజీ సర్పంచ్ సీపీఎం నాయకులు మీసాల కాశయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామని కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. అనంతరం స్థూపాన్ని ఆవిష్కరించారు. సమాజంలో అందరి కోసం ఎర్రజెండా పని చేస్తే, కొందరి కోసమే ఇతర పార్టీలు పనిచేస్తాయని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగన్న అన్నారు. ఇటీవల మరణించిన పాలకీడు మండల మాజీ సర్పంచ్ ( సిపిఎం) మీసాల కాశయ్య స్మారక స్థూపాన్ని ఆయన గురువారం కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మిర్యాలగూడ ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో, మీసాల కాశయ్య సర్పంచిగా పనిచేశారని తెలిపారు. సర్పంచిగా గ్రామ అభివృద్ధికి పాటుపడుతూ, తన వంతుగా పార్టీ ఎదుగుదలకు కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన అనారోగ్యంతో చిన్న వయసులోనే మరణించడం తనను బాధించిందని, ఆయన లేని లోటు కుటుంబానికి, స్థానికంగా పార్టీకి పూడ్చలేనిది అన్నారు. పార్టీ స్థానిక నాయకత్వం సహకారంతో స్థూపాన్ని నిర్మించడం పట్ల కుటుంబాన్ని అభినందించారు. కాశయ్య పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేయాలని స్థానిక నాయకత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్, మాజీ జెడ్పిటిసి ముషం నరసింహ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మట్టేష్, మాజీ సర్పంచి గుర్రం ధన మూర్తి, రాఘవరెడ్డి, మండల కమిటీ సభ్యులు దిద్దకుంట్ల పురుషోత్తం రెడ్డి, మల్లారెడ్డి, యేసు రత్నం, ఆర్లపూడి వీరభద్రం, నాయకులు ఎల్లయ్య, రామిరెడ్డి, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సిసి కెమెరాలను ఏర్పాటు

**నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం**

**ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్**



ఆత్మకూర్ ఫిబ్రవరి 06 తీన్మార్ న్యూస్:- నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ అన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో ఆత్మకూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కావున గ్రామంలోని పలు కాలనీలలో కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చిన తెలుస్తుందని, కాలనీలలో ఎలాంటి అలజడి జరిగిన వెంటనే పోలీసులు చేరుకుని నివారించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.కాలనీలలో ఉన్న సిసి కెమెరాలు జిపిఎస్ కనెక్ట్ చేయడం వల్ల జిల్లా కమాండ్ కంట్రోల్ నుండి మరి హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ కి అనుసంధానం చేసి వీక్షించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నేరాలు నియంత్రించవచ్చని తద్వారానే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని, సీసీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. గ్రామాల ప్రజలు, వ్యాపారులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం మరియు అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది పెద్దలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సుమారు 80000 రూపాయలు చందాగా అందజేశారు. గ్రామంలో 16 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించినట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు వినయ్ కుమార్ రెడ్డి ప్రతాపరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎంపిటిసి లక్ష్మన్న సి ప్రవీణ్ కుమార్ మాజీ సర్పంచ్ రాజు పంచాయతీ కార్యదర్శి జైపాల్ రెడ్డి యుగంధర్ రెడ్డి ఆనంద్ గౌడ్ నరసింహారెడ్డి, స్వామి అశోక్ పోలీస్ శాఖ సిబ్బంది రామకృష్ణ సురేందర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైమరీ స్కూల్ అకస్మాత్తుగా తనిఖీలు చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



మక్తల్ ఫిబ్రవరి 06 తీన్మార్ న్యూస్:- నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం లోని రాయికోడు గ్రామంలో మరియు కల్వాల గ్రామంలో పర్యటించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూర్ భాస్కర్ నారాయణపేట జిల్లా అధికార ప్రతినిధి నర్సం గౌడ్ నర్వ మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు తీలేటి అజిత్ సింహారెడ్డి పర్యటించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రాయకోడు గ్రామంలోని ప్రైమర్ స్కూల్ మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది.అక్కడ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎలా అందిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగింది. మధ్యాహ్న భోజనానికి కావాల్సిన నూతన పాత్రలను తన సొంత నిధులతో అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మరియు ఇంతకు ముందు ఇచ్చినటువంటి హామీ గుర్తుంచుకొని మరి ప్రైమరీ స్కూల్ వాలంటీర్లకు 40 వేల రూపాయలు జీతం అందించడం జరిగింది.ప్రైమరీ స్కూల్ హెచ్ఎం స్కూలుకు సహాయం అందించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ని శాలువాతో సన్మానించడం జరిగింది. మరియు అంగన్వాడి కేంద్రాలకు ఇచ్చినటువంటి హామీని పిల్లలకు కావాల్సిన ప్లేట్లు గ్లాసులు అందించడం జరిగింది. రెండవ అంగన్వాడీ కేంద్రంలో నీటి సమస్య ఉందని తెలుసుకొని వారికి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అంగన్వాడి నూతన భవనానికి స్థల పరిశీలన చేయడం జరిగింది. మరియు రాయికోడ్ గ్రామంలోని అంబేద్కర్ కూడలిలో కేంద్రం నిధులతో ఏర్పాటు చేసేటటువంటి ఐమాక్స్ లైట్ల స్థల పరిశీలన చేయడం జరిగింది. అదేవిధంగా కల్వాల గ్రామంలోని ప్రైమర్ స్కూల్ మధ్యాహ్న భోజన వసతులను ఆకస్మికంగా తనకి చేసి అక్కడే విద్యార్థులతో పాటు భోజనం చేయడం కూడా జరిగింది.మరియు అక్కడే ఉన్న అంగన్వాడి కేంద్రం 2 లో 32 ఇంచెస్ ఎల్ఈడి టీవీ ని స్వయానా తన సొంత నిధులతో బహుకరించడం జరిగింది. అలాగే నూతన అంగన్వాడి భవనం గురించి చర్చించడం జరిగింది. కచ్చితంగా అరుణమ్మ అక్క గారితో చర్చించి నూతన అంగన్వాడి భవనాన్ని మంజూరు చేయించే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే భారతీయ జనతా పార్టీ మీకు అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో కల్వాల్ బూత్ అధ్యక్షులు మరియు బిజెపి సీనియర్ నాయకులు రామాంజి సాయిలు హనుమంతు మరియు రాయికోడు మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి వెంకట్ నరసింహులు గారు ఎం డి షఫీ ఉద్దీన్ రాయికోడ్ బూత్ అధ్యక్షులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు - 2 ఎకరాల 20 గుంటలు

**అందుకు సహకరించిన గ్రామస్తులు**



ఆత్మకూరు ఫిబ్రవరి 06 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం రేచింతల గ్రామంలో మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు స్కూల్ స్థలం గురించి జమ్ములమ్మ గుడి దగ్గర ఉన్నటువంటి గవర్నమెంట్ భూమి సర్వే నెంబర్ 39లో రెండు ఎకరాల 20 గుంటలు వనపర్తి జిల్లా కలెక్టర్ స్కూలుకు స్థలాన్ని కేటాయించడం జరిగింది. ఇట్టి సర్వే నెంబర్ 39 లో రెండు ఎకరాల 20గుంటలను బౌండరీని వేయించారు. ఈ సర్వేలో ముందుండి నడిపించినవారు, సరోజరాఘవేంద్ర సర్పంచ్, యాదయ్య గ్రామ అధ్యక్షుడు, చిన్న కొల్లంపల్లి,వార్డ్ మెంబర్ నరసింహ, రామకృష్ణ,వార్డ్ మెంబర్ రాములు, జయరాములు,ఎస్సీ రాములు, టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు సామేలు,దానయ్య,గొల్ల కొండన్న, గొల్ల యాదయ్య, హుస్సేన్ పాషా, మంగళ్ బాలస్వామి, శ్రీనివాస్ రెడ్డి, ఆవుల రాజు,గొల్ల కురుమన్న, వెంకటేష్,కుమ్మరి నరసింహ,గొల్ల గోపాల్, నరసింహ,రేచింతల గ్రామ ప్రజలు మరియు యువకులు గ్రామ పెద్దలు పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ పాల్గొనడం జరిగింది.

## మహిళలు అన్ని రంగాలలో ఎదగాలి

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలి.**

**ఆడపిల్లలపై చిన్న చూపు వద్దు అడ్డంకులను కష్టాలను అసమానతలను అధిగమిస్తూ ముందుకు సాగాలి.**

**అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్**





అమరచింత ఫిబ్రవరి 06 తీన్మార్ న్యూస్:- విద్యార్థినిలు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ఎలాంటి ఆకర్షణలకు గురికావదని ఎలాంటి వేధింపులకు నిరాదరణకు గురైన బాధిత మహిళలు బాలికలు మౌనం వీడి నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చి వేధింపుల నుండి బయటకు పడాలని అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ అన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తిపురం గ్రామంలోని స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఎదుగుతున్నారని ఆడపిల్ల అనగానే చిన్న చూపు చూడకుండా తల్లిదండ్రులు ఆడపిల్లలకు మగ పిల్లలతో సమానంగా స్వేచ్ఛను ఇవ్వాలని మగపిల్లలతో సమానంగా చదివించాలని అప్పుడే ఆడపిల్లలు మగపిల్లలతో సమానంగా అన్ని రంగాలలో దూసుకెళ్తారని అన్నారు మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళల పురోగతి కూడా ఎంతో ప్రాధాన్యం వహిస్తుందని ఒక మహిళా చదువుకొని ఉంటే ఆమె తన పిల్లలకు సమాజం పట్ల అవగాహన కల్పించే అవకాశం ఉంటుంది కాబట్టి ఆడపిల్లలను చదివించాలని ఎప్పటికప్పుడు తమ పిల్లలకు సమాజంలో జరుగుతున్న మంచి చెడుపై అవగాహన కల్పిస్తూ ఉండాలని అన్నారు. విద్యార్థులు కుటుంబంలో పాఠశాలలో మరియు సమాజంలో బాధ్యతమైన గౌరప్రథమైన జీవితాన్ని కొనసాగించాలని ఆత్మకూరు పోలీస్ శాఖ సిబ్బంది జ్యోతి శాంతి ప్రియ పలు సలహాలు సూచనలు తెలియజేశారు. అనంతరం మస్తిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో పోలీస్ శాఖ సిబ్బందిని సన్మానించారు ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వెంకటన్న ఉపాధ్యాయులు ఎస్ ప్రభాకర్ పాండు రామన్ గౌడ్ ఏ రాజేష్ క్రాంతి వెంకటేశ్వరమ్మ మరియు శ్రావణి పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మహా చండి యాగం



**ఫోరం జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్**

జగిత్యాల, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ముఖ్య సలహాదారులు ఓరుగంటి ఆనంద్ అన్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేకమైన సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆహార భద్రత కమిషన్ సభ్యులు ఉద్యమకారుల ఫోరం చీఫ్ సలహాదారులు ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు ఐక్యతకు కుల మత లకు అతీతంగా ఈ మహా చండీయాగం నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్రంలో ఉన్న నలుమూలలున్న ఉద్యమకారులు హాజరై మన యొక్క ఇట్టి కార్యక్రమానికి బ్రహ్మాండంగా విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది మరియు రాష్ట్ర నాయకులు జోగి రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగల రవీందర్ రెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎడ్ల జోగి రెడ్డి మాట్లాడుతూ మార్చ్ మొదటి వారంలో మానకొండూరు నియోజకవర్గం తుమ్మాపూర్ మండల కేంద్రంలోని తపాల నరసింహస్వామి ఆలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్రవ్యాప్త ఉద్యమకారులు హాజరై ఇట్టి బలమైనటువంటి సంకల్పానికి సహకరించాలని ఉద్యమకారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది. జగిత్యాల జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు అనేక రూపాల్లో చేసి అటువంటి కార్యక్రమాలు చేయడం జరిగింది అదేవిధంగా ఇప్పుడు చండీయాగం మార్చ్ మొదటి వారంలో నిర్వహించడం. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఉద్యమకారులను ఆహ్వానించటం ఉద్యమకారుల ఐక్యతకు బలాన్ని చేకూరుస్తుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గం బాధ్యులు వంగల శ్రీనివాస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కరీంనగర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమారాణి కరీంనగర్ జిల్లా మహిళా టౌన్ అధ్యక్షురాలు కారుపాకలమున్న, మునక్కా దేవుని అంకుష్ భూమ సదానందం తాటిపల్లి శంకర్ కనకం శంకర్ కూనమల మల్లేశం విజయభాస్కర్ రెడ్డి గాలి రమేష్ యాదవ్ కనక లక్ష్మీ అంజలి లలిత ఠాగూర్ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది

## దయ్యాల సదయ్యను పరామర్శించిన ఎన్హెచ్ఆర్సి రాష్ట్ర అధ్యక్షులు డా. భద్రయ్య



మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర కమిటీ సభ్యులు దయ్యాల సదయ్య తండ్రి దయ్యాల రాజయ్య ఇటీవల మృతి చెందగా వారి స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం మెట్ పల్లిలో వారి కుటుంబాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుమారులైన దయ్యాల సదయ్యను మరియు అతని సోదరున్ని పరామర్శించారు. తండ్రిగారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుండ్ర కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాండ్ల రవీందర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్, క్రాంతి కుమార్, మొగుళ్లపల్లి మండల అధ్యక్షులు మెరుగు సురేష్, మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజకుమార్, మండల ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు సంగి రవి, చంద్రమౌళి, ములుగు జిల్లా సంయుక్త కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని కలిసిన పార్టీ సీనియర్ నాయకులు

**సర్పంచ్ పెండింగు బిల్లుల విడుదలకు విజ్ఞప్తి**



ములుగు, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం హైదరాబాదులోని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని ములుగు జిల్లా సర్పంచ్ పెండింగు బిల్లులపై మరియ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోరిక గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని కలవడం జరిగింది. దీనిపై మాజీ మంత్రి తక్షణమే స్పందించిన మాజీ మంత్రి పెండింగ్ బిల్లుల కొరకు ప్రభుత్వంతోడు మాట్లాడి ఇప్పిస్తామని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు ములుగు మండల ఫోరం మాజీ అధ్యక్షులు శివతాండ సర్పంచ్ భూక్య పాప పవన్ కుమార్ మరియు రామచంద్రపురం సర్పంచ్ హట్కర్ కల్పన రూప్ సింగ్ నాయక్ ముదునూరుతండా సర్పంచ్ గుగులోత్ తిరుపతి నాయక్ మరియు సర్పంచ్ యాకూబ్ నాయక్ మల్లంపల్లి సర్పంచ్ చంద కుమారస్వామి పాల్గొన్నారు.

## దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న సోదా రామకృష్ణ



నడికుడ, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం నడికుడ మండలం నార్లపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కబడ్డీ ప్లేయర్ కీ. శే. శనిగరపు రవీందర్ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఒంటేరు సారయ్య, ఏకు రాజు, నాయకులు నల్లెల్ల అనిల్ కుమార్, మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం**

**అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ఈ నెల 12 నుండి 15 వరకు మేడారం గ్రామంలో జరగనున్న మినీ మేడారం జాతరను విజయవంతం చేయడానికి భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. గురువారం తాడ్వాయి మండలం లోని మేడారం లో పలు శాఖల అధికారులతో కలిసి వైద్య శిబిరం ఏర్పాటు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఏర్పాటు చేసిన గదులను పరిశీలించిన అనంతరం గద్దెల ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు 10 నుండి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, నాలుగు రోజులపాటు జరిగే జాతర సందర్భంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు.వైద్య శాఖ సిబ్బంది అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర సమయాలలో ఇబ్బందులకు గురయ్యే వారిని జిల్లా కేంద్రానికి తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా చోరీ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్మికులచే నిరంతరం శుభ్రం చేయించాలని డిపిఓను ఆదేశించారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని, నిరంతరం పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న సందర్భంగా గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిర్లను ఏర్పాటు చేయడమే కాకుండా మ్యాట్లను ఏర్పాటు చేయాలని



దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు.
దాదాపు 5 కోట్ల 30 లక్షల రూపాయలతో వివిధ పనులను పూర్తి చేయడం జరిగిందని వివరించారు. జాతరను పురస్కరించుకొని పలుచోట్ల ప్రత్యేకంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, త్రాగునీటి కొరత ఏర్పడకుండా నిరంతరం నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుండి నిరంతరం బస్సులను మేడారం నడిపించనున్నారని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని తిరుగు ప్రయాణం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రవీందర్, డిపిఓ దేవరాజ్, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చౌలం నరసింగరావు దశదినకర్మలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంగపేట, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి సూచనల మేరకు మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చౌలం వెంకటేశ్వర్లు ఆదివాసీ నాయకులు చౌలం నరసింహారావు ఇటీవల గుండెపోటుతో స్వర్గస్తులవ్వగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

## జాతీయ క్షయ నివారణ కార్యక్రమం పై సమీక్ష





మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): జాతీయ క్షయ నివారణ పై గురువారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో క్షయ వ్యాధి నోడల్ పర్సన్స్, ల్యాబ్ టెక్నీషియన్, టీబీ సూపర్వైజర్లతో జిల్లా వైద్యా శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేయించాలని, ప్రతి నెల స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసి, క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించాలని, క్షయ వ్యాధి ఉన్న వారు, ఆరు నెలలు మందులు వాడినచో క్షయ నయమవునని, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసము ప్రతినెల క్షయ వ్యాధిగ్రస్తునికి 500 రూపాయలు కూడా ఇవ్వడం జరుగుతుందని, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా పుట్టగానే బీసీజీ వ్యాక్సిన్ టీకా వేయించాలని ప్రతి ఆశ కార్యకర్త ఆరోగ్య కార్యకర్త ప్రజల్లో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, కె.వి రాజు హెల్త్ ఎడ్యుకేటర్, హెచ్ ఈవో రామకృష్ణ, నీలిమ శ్వేత, అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలు చదువుతోపాటు క్రీడా, సామాజిక అంశాలలో ముందుండాలి

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో**



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): జాతీయ బాలిక దినోత్సవం-25, సందర్భంగా గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్త్రీ, శిశు, సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సమాజంలో బాల బాలికలు సమానమని, బాలికలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు.



జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని బేటి బచావో బేటి పడావో నినాదంతో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ బాలికలు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని వారు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన కొరకు కృషి చేయాలని, అధికారులంతా బాలికల అభ్యున్నతకి తోడ్పాటును అందించాలని సూచించారు. బాలికలో ఉన్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలన్నారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లలకు సరైన దిశానిర్దేశం చేస్తూ బావిభారత పౌరులుగా తీర్చిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని కోరారు. ఆడపిల్లలపై ఇంకా కొన్ని చోట్ల జరిగే అఘాయిత్యాలు, భ్రూణ హత్యలు, పిండ నిర్ధారణా పరీక్షలు, పూర్తి స్థాయిలో నిర్మూలించుటకు సమాజంలోఅవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, భిక్షాటన, అత్యాచారాలు, భ్రూణ హత్యలు,బాల కార్మిక నిర్మూలన, వేధింపులు, అక్రమ దత్తత నిర్మూలించి, బాలికల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.విద్యతోపాటు సామాజిక అంశాలు, క్రీడలు, ఆర్థిక అభివృద్ధి, స్వయం రక్షణ పై ప్రభుత్వం అనేక కార్యక్రమాలు పథకాలు నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమాల్లో బాలికలు ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడబ్ల్యుసి చైర్పర్సన్ జి. నాగవాణి, డిఇఓ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య అధికారి డాక్టర్ మురళీధర్, డిఆర్డిఓ మధుసూదన రాజు, సి డబ్ల్యూ సి మెంబర్స్ డేవిడ్, అశోక్ కుమార్, డిడబ్ల్యుఓ ధనమ్మ, తదితరులు జాతీయ బాలిక దినోత్సవం గురించి మాట్లాడారు. అంతకుముందు బాలికలు మహిళా బాలికా సంరక్షణ పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు, వివిధ క్రీడా పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓలు నిలోఫర్, శిరీష, ఎల్లమ్మ, రాజ్యలక్ష్మి, లక్ష్మి, కమల, విజయలక్ష్మి, ఇందిరమ్మ, సఖి సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ముక్తేశ్వర స్వామి క్షేత్రంలో కుంభాభిషేకం మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): కాళేశ్వర ముక్తేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేకం మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 7 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేకం మహోత్సవాల రోజు వారి కార్యక్రమాల షెడ్యూల్ ను గురువారం ఆయన ప్రకటించారు. మహా కుంభాభిషేకం మహోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. స్వామి వారి తీర్థ ప్రసాదాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భద్రతా పరమైన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులకు విధులు కేటాయించినట్లు తెలిపారు. 42 సంవత్సరాలు తరువాత జరుగుతున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ మహోత్సవాలను సమన్వయంతో విజయ వంతం చేయాలని సూచించారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. మహోత్సవాలకు విచ్చేయు భక్తులు జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలు



పాటించాలని ఆయన సూచించారు. చుట్టుప్రక్కల జిల్లాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బందోబస్తు, రద్దీ నియంత్రణ, వాహనాలు పార్కింగ్ వంటి చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

## సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఆర్టిఐ కమిషనర్లను నియమించాలి

**ఆర్టిఐ సామాన్యుడి చేతిలో వజ్రాయుధం**

**రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోల ఎన్నిక**



హైదరాబాద్, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోలను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు.సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చుని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గోపీనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు.మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారు అని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి,పందుల రాజు గౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి నాగేశ్వరరావు మరణం బాధాకరం

**జిల్లా మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ బడే నాగజ్యోతి**



ఏటూరు నాగారం, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ఏటూరునాగారం మండలం బుట్టాయి గూడెం గ్రామం కొత్తూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి నాగేశ్వర్ రావు (నాగయ్య) మనస్తాపానికి చెంది అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడగా నిన్న రాత్రి మరణించారు అని తెలుసుకున్న బడే నాగజ్యోతి వారి యొక్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. శోక సంద్రంలో ఉన్న వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలి అని అలాగే ప్రభుత్వం కూడా వారి యొక్క కుటుంబానికి 25 ఎక్స్గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు ఇది ప్రజా ప్రభుత్వం కాదు ప్రజల ప్రాణాలు తీస్తున్న రాక్షస ప్రభుత్వం అని అన్నారు కుమ్మరి నాగేశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలి అని డిమాండ్ చేశారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రినీ ఆకస్మికంగా తనిఖీ చేసి, డిఈఐసి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆర్బీఎస్కె ఆధ్వర్యంలో నడిచే (డిఈఐసి)ని తక్షణమే సేవలను ప్రారంభించాలని పిల్లలకు కావాల్సిన ఫిజియోథెరపీ, డెంటల్, తదితర సౌకర్యాలను కల్పించాలని సంబంధిత వైద్య అధికారులకు సూచించారు. ఆస్పత్రిలో డయాలసిస్ పేషెంట్లకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తొర్రూరు లో డయాలసిస్ సెంటర్ మిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వైద్య సేవలు అందించాలని, సూచించారు. ఈ తనిఖీలో ఆయన వెంట జిల్లా ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, డాక్టర్ హర్షవర్ధన్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయసు గల వారందరికీ నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ మరియు గిరిజన ఆశ్రమ పాఠశాలలు మరియు వసతి గృహాలలో ప్రతి విద్యార్థులకు మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమధ్యం నివారించవచ్చు, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యాశాఖ, ఏఎన్ఎం, అంగన్వాడీలు సమన్వయంగా పనిచేసి జిల్లాలోని విద్యార్థులందరికీ మాత్రలను అందివ్వాలి అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడి పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అంగన్వాడి టీచర్లకు శిక్షణ ఇచ్చి వయసుల వారీగా మాత్రల డోస్ ఇవ్వాలన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు వేసే




ప్రదేశంలో తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలో 336,212 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల వారు ఉన్నారని ఆయన తెలిపారు. వారి అందరికీ మాత్రలు అందించాలని తెలిపారు. ప్రత్యేక షెడ్యూల్ ని ఏర్పరచుకొని నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందివ్వాలి అన్నారు. ప్రజలకు అల్బెండజోల్ మాత్రల ఉపయోగాలపై కళా జాతర బృందాలు మరియు మహిళా సమాఖ్యల ద్వారా విస్తృత అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 10వ తేదీన మాత్రలు తీసుకొని వారికి 17వ తేదీన మాప్ అఫ్ డే నిర్వహించి మాత్రలు అందించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అన్ని విద్యార్థులకు మాత్రలు అందేలా చూడాలని, అనంతరం నివేదికలు సమర్పించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నులిపురుగుల నిర్మూలలకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, డిసిహెచ్ఓ రవిబాబు, మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూయ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి

### ఎన్డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ ఎస్కే బెహ్రా



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని ఎన్డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ ఎస్కే బెహ్రా తెలిపారు. గురువారం భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామంలో ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించన సందర్భాలలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై కమ్యూనిటి అవగాహన కార్యక్రమం నిర్బహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, 10వ బెటాలియన్ కమాన్డెంట్ వీవీఎస్ ప్రసన్న కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ 14వ తేదీ వరకు మండల కేంద్రాలు, పరిసర గ్రామాలు, పాఠశాలలు, పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కమ్యూనిటి అవగాహన కార్యక్రమాలు ద్వారా ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విపత్తు నివారణ, ఉరుములు, మెరుపులు, పిడుగులు, వడగండ్లు, ఈదురుగాలులు వీచినపుడు ప్రజలు భయాందోళలకు గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి సహాయక చర్యలు చేపట్టి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఎఫ్ బృందాలు నిర్వహించిన పలు డెమోలను, విపత్తులు సమయంలో తీసుకొనే చర్యల మాక్ డ్రిల్ కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు, ఆర్ఐ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజెపీ బీసీ బాలికల విద్యాలయంను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ విద్యాచందన





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): పాల్వంచ మహాత్మ జ్యోతి బాపులే బీసీ బాలికల గురుకుల విద్యాలయంను గురువారం రాత్రి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆమె తరగతి గదులకు ప్రవేశించి స్టడీ అవర్ లో విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉపయోగించుకునే టాయిలెట్స్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే పరిశుభ్రమైన తాగునీటిని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇందిరా మరియు విద్యాలయ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు చదువుల్లో అత్యుత్తమ ప్రతిభను చాటాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): విద్యార్థినులు చదువుల్లో అత్యుత్తమ ప్రతిభను చాటాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం సాయంత్రం హనుమకొండ రెడ్డికాలనీలోని తెలంగాణ ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పట్టికను పరిశీలించారు. వంట సామగ్రి భద్రపరిచిన స్టోర్ రూమ్ ను తనిఖీ చేశారు. భోజనశాలను పరిశీలించి వివరాలను బీసీ వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పరాణి ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినుల విద్యా ప్రగతి, వసతి గృహంలో కల్పిస్తున్న సదుపాయాలు గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ కళాశాలలకు ఆర్టీసీ బస్సులలో వెళ్తున్నామని, కళాశాల వసతి గృహం వద్ద ఆర్టీసీ బస్సులు ఆగే విధంగా చూడాలని కలెక్టర్ ను విద్యార్థినులు కోరారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు ఆగేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థునులకు మెనూ ప్రకారం అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. వసతి గృహానికి దోమలు రాకుండా మెష్ ను ఏర్పాటు చేయించాలన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్టిపిల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించండి



### హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి ప్రావిణ్య, డా. సత్య శారద

### యూజీడి ప్రాథమిక సర్వే పూర్తిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): ఎస్ టి పి ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి ప్రావిణ్య డా. సత్య శారద అన్నారు. గురువారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలోని మినీ సమావేశమందిరంలో బల్దియా ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగు నీటి నిర్వహణ వ్యవస్థ, ఎస్ టీ పి ల ఏర్పాటు కోసం స్థలాల గుర్తింపు" పై అధికారులు, కన్సల్టెన్సీ లతో జరిగిన సమన్వయ సమావేశంలో పై ఎన్ కే బిల్డ్ కాన్ ప్రైవేటు లిమిటెడ్ కన్సల్టెంట్ ప్రతినిధులచే ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో కలెక్టర్ల తో పాటు కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఇరు జిల్లాలకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొని సమీక్షించారు. వరంగల్ మహా నగరంగా పాలక సంస్థ పరిధిలోని 2055 సంవత్సరం వరకు సుమారు 21.31 లక్షల జనాభాకు అవసరమయ్యే ప్రణాళికలు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాథమిక సర్వేను నిర్వహించినట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారని. అందుకుగాను 9 జోన్లను ఏర్పాటు చేసి, ప్రతి జోన్లో సీవేరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లో అవసరమైన స్థలం గురించి కన్సల్టెన్సీ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ సర్వేలో ఎస్టీపీల కొరకు స్థలాల ఫీజిబిలిటీని సంబంధిత రెవెన్యూ అధికారులు బృందాలను ఏర్పాటు చేసుకొని క్షేత్రస్థాయిలో ఆయా స్థలాలను పరిశీలించి త్వరితంగా ఎంపిక చేయాలన్నారు. ఆయా మండలాల పరిధిలో సాధ్యపడకపోతే మరో ప్రాంతాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ శ్రీనివాసరావు, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, రాథోడ్ రమేష్, కూడా సిపిఓ అజిత్ రెడ్డి, బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సిటీ ప్లానర్ రవీందర్ రాధాకర్ ఇరిగేషన్ అధికారి సీతారాం, ఈఈ లు తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలను గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద సందర్శించి ఆసుపత్రి ఆవరణ తో పాటు కళాశాల లెక్చర్ హాల్ హాస్టల్ యందు పర్యటించి వైద్య విద్యార్థులలో మాట్లాడి వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సంబంద అంశాలు తన దృష్టికి రావడం జరిగిందని శానిటేషన్ గురించి నర్సంపేట మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయనున్నట్లు, హాస్పిటల్ యందు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి పేషెంట్ సేవలు అందించేందుకు చర్యకు చేపడతామని అన్నారు. అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. అంతకు ముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గల డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నిర్వహిస్తున్న రిజిస్టర్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య కళాశాల నియంత్రణ లోకి తెస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టి వి వి పి)ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఇందుకు సంబంధించిన విషయాల తో పాటు వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో చేయాల్సిన ఏర్పాట్ల పై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.మోహన్ దాస్ ప్రో.రమేష్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని వరకు నాలుగు లైన్ల రోడ్డు

### మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు డబుల్ లైన్ రోడ్డు

### రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించాలి

### రోడ్లు ఽ భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్



జనగామ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం, హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌లి అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర రోడ్ల నిర్మాణ విస్తరణ వ్యవస్థపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రోడ్లు %ఽ% భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని వరకు నాలుగు లైన్ ల రోడ్డు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు డబుల్ లైన్ రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు పంపించాలని అన్ని జిల్లాల కలెక్టర్ లను ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయి-ఽలో ఈ రోడ్ల విస్తరణకు కలెక్టర్ ఛైర్మన్ గా రోడ్ల నిర్మాణ ఏజెన్సీ నుంచి ఒకరు, ఈఈ ఒకరు సభ్యులుగా ఈ కమిటీ లో ఉంటారని తెలిపారు.

## విద్యార్థులకు సౌకర్యాలను అందుబాటులోకి తేవాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జనగామ జిల్లా, ఫిబ్రవరి 06 (తీన్మార్ న్యూస్): గురువారం చిల్పూర్ మండలం రాజవరంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు స్టాక్ రిజిస్టర్ ల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు వసతి సౌకర్యాలను పెంపొందించేందుకు నిర్మించిన గదులను వినియోగించుకోవాలని కెజిబివి ప్రత్యేక అధికారి ప్రశాంతికి తెలిపారు. పాఠశాల మరమ్మతుల పనులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదుల కిటికీలు, తలుపుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వంటగదిని పరిశీలించి విద్యార్థుల భోజనం కొరకు వినియోగిస్తున్న కూరగాయలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సమయం సమీపించినందున విద్యార్థులు అందరూ హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. గణితం పై పట్టు సాధించేందుకు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. వైద్య సౌకర్యాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకుంటూ సమయానికి ఆహారం, నిద్ర అవసరమని అప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. తద్వారా విద్యపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఇతర వసతులపై కలెక్టర్ ఆరా తీయగా త్రాగునీటికి, వినియోగానికి నీరు సరిపోవట్లేదని క్రీడా వస్తువులు సరిపోను లేవని, డిజిటల్ తరగతుల ఎక్విప్మెంట్ రిపేర్ చేయించాలని కలెక్టర్ దృష్టికి తేగా వేసవి దృష్ట్యా బోర్ లో భూగర్భ జలాలు అడుగంటినందున నీరు తక్కువగా వస్తున్నదని స్పెషల్ ఆఫీసర్ వివరించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటివినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం చిల్పూర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి రికార్డుల నిర్వాణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధరణి పెండెన్సీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, ధ్రువీకరణ పత్రంల జారి పై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో డిఎస్ వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, ఎంపీడీవో వెంకన్న, తాసిల్దార్ సరస్వతి, డిటి రామారావు కేజీబీవీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# వరుసగా రెండో రోజూ నష్టాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల పరిణామాలు, అమెరికా బాండ్ల రాబడి తగ్గుముఖం పట్టడం వంటి పాజిటివ్ సంకేతాలున్నప్పటికీ.. మన మార్కెట్లు నష్టాల్లో ముగియడం గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడమే దీనికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. సెన్సెక్స్ ఉదయం 78,513.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,271.28) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా అదే బాటలో పయనించింది. చివరికి 213.12 పాయింట్ల నష్టంతో 78,058.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.55 పాయింట్ల నష్టంతో 23,622.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.60గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, ఎన్టీపీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.94 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2880 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# 12 నుంచి హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపీఓ

## ఐటీ సెక్టార్‌లో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ




ఐటీ సేవల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో రీఎంట్రీ ఇవ్వనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ ఫిబ్రవరి 12న ప్రారంభమై 14న ముగియనుంది. మొత్తం రూ.8750 కోట్లు సమీకరించేందుకు వస్తున్న ఈ కంపెనీ ఐపీఓలో భాగంగా ధరల శ్రేణిని రూ.674-708గా నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి 11న సబ్‌స్క్రిప్షన్ తెరుచుకోనుంది. ముంబయి కేంద్రంగా సేవలందిస్తున్న ఈ కంపెనీ ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. ప్రముఖ ఈక్విటీ సంస్థ కార్లైల్ గ్రూప్‌నకు చెందిన సీఏ మాగ్నమ్ హోల్డింగ్స్ సంస్థ మెజారిటీ షేర్లను విక్రయించనుంది. ప్రస్తుతం ఈ సంస్థకు కంపెనీలో 95.03 శాతం వాటా ఉంది. ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరుగుతుండడంతో ఐపీఓ నిధులు పూర్తిగా వాటాదారులకే వెళ్లనున్నాయి. ఐటీ సెక్టార్‌లో అతిపెద్ద ఐపీఓ ఇదే కావడం గమనార్హం. రెండు దశాబ్దాల క్రితం టీసీఎస్ రూ.4700 కోట్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది. ఐపీఓలో 50 శాతం షేర్లను క్యూఐబీలకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు కంపెనీ రిజర్వ్ చేసింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు లిస్ట్ కానున్నాయి. ఇక కంపెనీ వివరాల్లోకి వెళితే.. హెక్సావేర్ టెక్నాలజీస్ సంస్థ.. గ్లోబల్ డిజిటల్, టెక్నాలజీ సర్వీసెస్‌ను అందిస్తోంది. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 31 కంపెనీలకు సేవలందిస్తోంది. అమెరికా, యూరప్, భారత్, పశ్చిమాసియా ప్రాంతాల్లో కస్టమర్లు ఉన్నారు. ఈ కంపెనీ గత ప్రమోటర్ అయిన బేరింగ్ ప్రైవేట్ ఈక్విటీ ఆసియా.. 2020లో ఈ కంపెనీని డీలిస్ట్ చేసింది. 2021 అక్టోబర్‌లో బేరింగ్ ఈక్విటీ సంస్థ నుంచి కార్లైల్ గ్రూప్ కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో రూ.853 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. రూ.8,820 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జేపీ మోర్గాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హెచ్ఎస్‌బీసీ సెక్యూరిటీస్, క్యాపిటల్ మార్కెట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవరిస్తున్నాయి.

# క్లీన్‌మాక్స్.. అమెజాన్‌తో విద్యుత్ ఒప్పందం

ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ..'క్లీన్‌మాక్స్.' కర్ణాటకలో 100 మెగావాట్ల పవన(విండ్) ఇంధన ప్రాజెక్ట్ కోసం అమెజాన్‌తో విద్యుత్ ఒప్పందంపై సంతకం చేసినట్లు ఈరోజు(గురువారం) తెలిపింది. అమెజాన్‌తో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్‌లో భాగంగా కర్ణాటకలోని కొప్పల్‌లో పవన ఇంధన ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసి నిర్వహిస్తామని క్లీన్‌మాక్స్ తెలిపింది. క్లీన్‌మాక్స్ ఇక్కడ ఏటా 355 మిలియన్ కెడబ్ల్యూహెచ్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ నేషనల్ గ్రిడ్‌కు అనుసంధానమయి..అమెజాన్ కార్యకలాపాలకు విద్యుత్ శక్తిని అందిస్తుంది. 'క్లీన్‌మాక్స్' (వాణిజ్య, పారిశ్రామిక) రంగంలో ఆసియాలోని ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థల్లో ఒకటిగా పేరుగాంచింది. ఈ సంస్థ భారత్‌తో పాటు మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా అంతటా తన ఉనికిని కలిగి ఉంది. ఇది అత్యంత నైపుణ్యతతో కూడిన వృత్తిపరమైన బృందంతో 2 గిగావాట్ల (ఆపరేటింగ్) పునరుత్పాదక ఆస్తులను కలిగి ఉంది.



# టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు వేరియబుల్ పేలో కోత!




**ముంబయి:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ పేలో కోత పెట్టింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి గానూ చెల్లించాల్సిన వేరియబుల్ పేలో ఈ కోత విధించింది. వర్క్ ఫ్రమ్ ఆఫీసు నిబంధనలు పాటించినప్పటికీ చెల్లించాల్సిన మొత్తం తగ్గించడం గమనార్హం. ఇలా చేయడం ఇది వరుసగా రెండో త్రైమాసికమని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ మనీకంట్రోల్ ఓ కథనాన్ని ప్రచురించింది. జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో కొందరు ఉద్యోగులు త్రైమాసిక వేరియబుల్ పే అలవెన్స్ కింద 20-40 శాతం మాత్రమే అందుకున్నట్లు మనీకంట్రోల్ తెలిపింది. కొందరికి పూర్తిగా చెల్లించలేదని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో చెల్లించిన 70 శాతంతో పోలిస్తే ఈ మొత్తం చాలా తక్కువని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. క్యూవీఏ కింద తనకు రూ.54 వేలు చొప్పున రావాల్సి ఉండగా.. గత త్రైమాసికంలో రూ.21వేలు మాత్రమే అందుకున్నట్లు ఓ ఉద్యోగి తెలిపారు. ఈ సారి కేవలం రూ.16వేలు మాత్రమే చేతికొచ్చిందని చెప్పారు. 70 శాతం జూనియర్ ఉద్యోగులకు నూరు శాతం క్యూవీఏ చెల్లింపులు జరిగాయని, 30 శాతం మంది సీనియర్ ఉద్యోగులకు మాత్రం పనితీరు ఆధారంగా వేరియబుల్ పే చేసినట్లు మరో ఉద్యోగి పేర్కొన్నారు. దీనిపై టీసీఎస్‌ను వివరణ కోరగా.. ఊహాగానాలపై స్పందించబోమంటూ నిరాకరించినట్లు మనీకంట్రోల్ తెలిపింది.

### వర్క్‌ఫ్రమ్ ఆఫీసుతో లింక్

ఉద్యోగులను కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసింది. వేరియబుల్ పేను ఆఫీసు హాజరుతో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీసుకు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులూ ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్న వారికి 50 శాతం, 75-85 శాతం ఉన్న వారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే పూర్తి వేరియబుల్ పే అందుకొనేందుకు అర్హులుగా పేర్కొంది. అయితే, వర్క్‌ఫ్రమ్ ఆఫీసు నిబంధనలు అనుగుణంగా నడుచుకున్నప్పటికీ.. వేరియబుల్‌లో సీనియర్ ఉద్యోగులకు కోత పెట్టినట్లు కొందరు ఉద్యోగులు చెబుతున్నారు.




# ఎయిర్‌టెల్ లాభం ఐదింతలు..

దేశంలోనే రెండో అతిపెద్ద టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.16,124.6 కోట్ల నికర లాభం నమోదైనట్లు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2876 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం దాదాపు ఐదింతలు పైనే కావడం విశేషం. ఇక కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే 19 శాతం వృద్ధి చెందింది. రూ.37,899.5 కోట్ల నుంచి రూ.45,129.3 కోట్లకు పెరిగింది. టెల్కోల ఆదాయాలకు కొలమానంగా భావించే నెలలో ఒక యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం ఏకంగా రూ.245కి చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ మొత్తం రూ.208గా ఉంది.

# బిగ్‌బాస్కెట్‌లో శాంసంగ్ కొత్త ఫోన్..

## 10 నిమిషాల్లో డెలివరీ




ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ ఇటీవల కొత్త మొబైల్‌ను ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. తన ఫ్లాగ్‌షిప్ మోడల్ గెలాక్సీ 'ఎస్' సిరీస్ నుంచి ఎస్25 ఫోన్లను లాంచ్ చేసింది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి భారత మార్కెట్లో వీటి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఫోన్లు ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ 'బిగ్‌బాస్కెట్'లోనూ అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది. శాంసంగ్ గెలాక్సీ ఎస్25, గెలాక్సీ ఎస్25 అల్ట్రా మోడళ్లను బిగ్‌బాస్కెట్ విక్రయించనున్నట్లు సమాచారం. దీనిపై క్విక్‌కామర్స్ యాప్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయనప్పటికీ.. ఆ ప్లాట్‌ఫామ్‌లో దీనికి సంబంధించిన టీజర్ ఉండటంతో విక్రయాలు ఖాయమేనని తెలుస్తోంది. వీటిని 10 నిమిషాల్లోనే కస్టమర్లకు ఫోన్లను డెలివరీ చేయనున్నట్లు టీజర్ బట్టి అర్థమవుతోంది. అంతేకాకుండా.. కొన్ని బ్యాంక్ ఆఫర్లను కూడా అందుబాటులో ఉంచనున్నట్లు సమాచారం. బిగ్‌బాస్కెట్‌లో గెలాక్సీ ఎస్25 ఫోన్ (12 జీబీ ర్యామ్ ం 256 జీబీ స్టోరేజీ) ధర రూ.80,990గా ఉండనున్నట్లు టీజర్‌లో పేర్కొన్నారు. ఇక, గెలాక్సీ ఎస్25 అల్ట్రా ఫోన్ (12 జీబీ ర్యామ్ ం 512 జీబీ స్టోరేజీ) ధర రూ.1,29,999గా ఉండనుందట. వీటిపై రూ.10వేలు వరకు ఇన్‌స్టంట్ బ్యాంక్ డిస్కౌంట్లు ఇవ్వనుంది. ఇక, నోకాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచే ఈ ప్లాట్‌ఫామ్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. అయితే, బిగ్‌బాస్కెట్‌లో ఇలా 10 నిమిషాల్లో స్మార్ట్‌ఫోన్ డెలివరీలు చేయడం ఇదే తొలిసారి కాదు. అంతకుముందు సెప్టెంబరులో క్రోమా భాగస్వామ్యంతో ఐఫోన్ 16, ఐఫోన్ 16 ప్లస్ డెలివరీలను అందించింది. అయితే, బెంగళూరు, దిల్లీ-ఎన్సీఆర్, ముంబయి నగరాల్లో మాత్రమే ఈ విక్రయాలు చేపట్టింది. తాజాగా శాంసంగ్ ఫోన్లను దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో అందిస్తారా? లేదా అన్నది ఇంకా తెలియరాలేదు.

# అదరగొట్టిన ఎస్‌బీఐ.. క్యూ3లో లాభం 84% వృద్ధి




**ముంబయి:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.16,891 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9163 కోట్ల నికర లాభంతో పోలిస్తే నికర లాభం 84 శాతం పెరిగింది. మార్కెట్ అంచనాలు మించి నికర లాభాన్ని నమోదు చేయడం విశేషం. అంతకుముందు త్రైమాసికంతో పోల్చినప్పుడు మాత్రం నికర లాభంలో 8 శాతం క్షీణత నమోదైంది. క్యూ2లో నికర లాభం రూ.18,331 కోట్లుగా ఉంది. ఇక సమీక్షా త్రైమాసికంలో వడ్డీ ద్వారా వచ్చే ఆదాయం రూ.1.06 లక్షల కోట్ల నుంచి 10 శాతం వృద్ధితో రూ.1.17 లక్షల కోట్లకు పెరిగింది. గత త్రైమాసికంలో 2.13 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు 2.07 శాతానికి తగ్గాయి. అలాగే 0.53 శాతంగా ఉన్న నికర ఎన్పీఏలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ షేర్లు 0.39 శాతం నష్టంతో 763.05 వద్ద కొనసాగుతున్నాయి.




# జొమాటో లిమిటెడ్ ఇక ఎటర్నల్ లిమిటెడ్..

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమోటో లిమిటెడ్ కంపెనీ పేరు మారింది. ఇకపై ఎటర్నల్ లిమిటెడ్‌గా వ్యవహరించనున్నారు. దీనికి సంబంధించిన కొత్త లోగోను ఆవిష్కరించారు. రెండేళ్లుగా ఇదే పేరును అంతర్గతంగా వాడుతూ వస్తున్న ఆ సంస్థ.. తాజాగా పేరు మార్చింది. ఈ మేరకు వాటాదారులకు కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ గురువారం లేఖ రాశారు. బ్లింకిట్‌ను సొంతం చేసుకున్నప్పటి నుంచి జొమాటోను తాము ఎటర్నల్‌గా వ్యవహరిస్తూ వచ్చామని దీపిందర్ తన లేఖలో పేర్కొన్నారు. కంపెనీకి బ్రాండ్/యాప్ మధ్య వ్యత్యాసం ఉండాలన్న ఉద్దేశంతో ఈ పేరు మార్పు చేపట్టినట్లు తెలిపారు. ఇకపై జొమాటో లిమిటెడ్ కాస్త ఎటర్నల్ లిమిటెడ్ మారుతుందన్నారు. జొమాటో బ్రాండ్, యాప్ పేరులో ఎలాంటి మార్పూ ఉండబోదని చెప్పారు. ఈ మేరకు పేరు మార్పునకు బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. వాటాదారులు దీనికి సహకరించాలని కోరారు. ఇకపై తమ కార్పొరేట్ వెబ్‌సైట్ జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌కు మారుతుందన్నారు. స్టాక్ టిక్కర్ సైతం జొమాటో నుంచి ఎటర్నల్‌కు మారుతుందని చెప్పారు. ప్రస్తుతం ఈ కంపెనీ పరిధిలో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్ ప్యూర్ పేరిట వేర్వేరు వ్యాపారాలు నిర్వహిస్తోంది.

# 'జీసీసీ'ల్లో 4.5 లక్షల కొత్త ఉద్యోగాలు




గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీల)లో ఈ ఏడాది 4.25-4.5 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ వెల్లడించింది. 'ఇండియా జీసీసీ గ్రోత్ అవుట్‌లుక్ 2024' పేరుతో ఎన్ఎల్‌బీ సర్వీసెస్ రూపొందించిన నివేదిక ప్రకారం.. ఆరేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు జీసీసీల ద్వారా లభిస్తాయి. 35% కంపెనీలు, ఉద్యోగుల సంఖ్యను 50-100% పెంచుకోవాలని చూస్తున్నాయి. 2030 నాటికి ఈ రంగంలో 33 లక్షల మంది వృత్తి నిపుణులు ఉంటారు. నైపుణ్యం కలిగిన సిబ్బంది లభ్యత, జీసీసీలకు మద్దతుగా ప్రభుత్వ విధాన నిర్ణయాల వల్ల జీసీసీల గమ్యస్థానంగా భారత్ అవతరిస్తోంది. బెంగళూరు, ముంబయి, పుణె, చెన్నైల్లో ఉన్న జీసీసీల్లో తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)కు గిరాకీ బాగుంది. 2030 నాటికి 42% జీసీసీలు ఉద్యోగులను 50% పెంచుకోవాలనుకుంటున్నాయి. 61% జీసీసీలు 2030 నాటికి 50 శాతానికి పైగా మహిళలను నియమించుకోవాలని చూస్తున్నాయి. ప్రస్తుతం జీసీసీల్లో 7 శాతంగా ఉన్న మహిళల వాటా ఈ ఏడాది గణనీయంగా పెరగనుంది. అంతర్జాతీయ జీసీసీ కేంద్రంగా భారత్ స్థానం మరింత బలోపేతం కానుంది. గత మార్చికి 1,700 మేర ఉన్న జీసీసీలు.. 2030 నాటికి 2,100కు పైగా పెరుగుతాయి. మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.74 లక్షల కోట్ల)కు చేరువ కానుంది.

# ఫేక్ యాప్స్‌తో జాగ్రత్త..

## పాలసీదారులకు ఎల్ఐసీ అలర్ట్




ఫేక్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పాలసీదారులకు సూచించింది. తమ పేరు మీద నకిలీ యాప్స్ సర్క్యులేట్ అవుతున్నట్లు దృష్టికి రావడంతో తాజాగా పబ్లిక్ అడ్వైజరీని జారీ చేసింది. అలాంటి యాప్స్ వలలో పడొద్దని సూచించింది. "ఎల్ఐసీ ఇండియా పేరు మీద కొన్ని నకిలీ మొబైల్ అప్లికేషన్లు చెలామణి అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కాబట్టి పాలసీహోల్డర్లు, కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలి. ఎల్ఐసీ ఇండియా అధికారిక వెబ్‌సైట్, ఎల్ఐసీ డిజిటల్ యాప్, ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఇతరమార్గాల ద్వారా లావాదేవీలు జరపాలి" అని సూచించింది. ఇతర మార్గాల ద్వారా చేసే చెల్లింపులకు ఎల్ఐసీ బాధ్యత వహించబోదని స్పష్టంచేసింది. ఎల్ఐసీ అధికారిక యాప్‌ను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే.. వెబ్‌సైట్‌లోకి వెళ్లి సంబంధిత లింక్‌పై క్లిక్ చేసి మీకు కావాల్సిన (ఆండ్రాయిడ్/ఐఓఎస్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.







# భారత్ జోరు..

- వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం
- 248 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లండ్
- 38.4 ఓవర్లలో భారత్ సునాయస విజయం
- ఇంగ్లండ్ వెన్నువిరిచిన జడేజా, హర్షిత్ రాణా

**నాగ్‌పూర్:** ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్ ఇండియా వన్డే సిరీస్‌లోనూ బోణీ కొట్టింది. ఇంగ్లిష్ జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. 4 వికెట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చిత్తుగా ఓడించింది. కేవలం 38.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి.. తొలి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (87, 96 బంతుల్లో 14x4) చెలరేగి ఆడాడు. ఓ వైపు కండరాల నొప్పి వెంటాడుతున్నా.. అద్భుత పోరాటం చేశాడు. అక్షర్ పటేల్ (52, 47 బంతుల్లో 6x4, 1x6), శ్రేయస్ అయ్యర్ (59, 36 బంతుల్లో 9x4, 2x6) అర్ధశతకాలు సాధించారు. ఓపెనర్లు జైస్వాల్ (15), రోహిత్ శర్మ (2) నిరాశ పరిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్, మహమూద్, బెతెల్, రషీద్ తలో వికెట్ తీశారు.

## ఆదిలోనే ఎదురుదెబ్బ

249 పరుగుల సాధారణ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. జోఫ్రా ఆర్చర్ వేసిన ఐదో ఓవర్లో ఓపెనర్ జైస్వాల్ (15) షాట్‌కు ప్రయత్నించి.. కీపర్ సాల్ట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్లోనే కెప్టెన్ రోహిత్ శర్మ (2) లివింగ్‌స్టన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అయితే తొలి డౌన్‌లో వచ్చిన శుభ్‌మన్ గిల్ క్రీజులో నిలదొక్కుకున్నాడు. రెండో డౌన్‌లో వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు 113 పరుగులు చేశారు. ఇద్దరూ అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని బెతెల్ విడగొట్టాడు. 16వ ఓవర్ చివరి బంతికి శ్రేయస్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ అదే జోరు కొనసాగించాడు. గిల్‌తో కలిసి ఇంగ్లండ్ బౌలింగ్‌ను ఎడాపెడా బాదేశారు. విజయానికి మరో 28 పరుగుల దూరంలో ఉండగా.. రషీద్ బౌలింగ్‌లో అక్షర్ పటేల్ బౌల్డయి.. భారత ప్రేక్షకులను తీవ్ర నిరాశపరిచాడు. మిడిలార్డర్‌లో వచ్చిన రాహుల్ (2) రషీద్ బౌలింగ్‌లో కాట్ అండ్ బౌల్డ్‌గా వెనుదిరిగాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే మహమూద్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన గిల్.. బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. దీంతో ప్రేక్షకుల్లో ఒక్కసారిగా ఉత్కంఠ ఏర్పడింది. అయితే, హార్దిక్ పాండ్య (9), రవీంద్ర జడేజా (12) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి లక్ష్యాన్ని పూర్తి చేశారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ జట్టు 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బట్లర్ (52, 67 బంతుల్లో 4x4), బెతెల్ (51, 64 బంతుల్లో 3x4, 1x6 )అర్ధశతకంతో ఆకట్టుకున్నారు. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (43, 26 బంతుల్లో 5x4, 3x6) మెరుపు వేగంతో ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ.. సమన్వయ లోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ డకెట్ (32, 29 బంతుల్లో 6x4) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మిగతా వారెవరూ పెద్దగా రాణించలేదు. అరంగేట్ర బౌలర్ హర్షిత్ రాణా తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శన చేశాడు. కీలకమైన 3 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. జడేజా మూడు వికెట్లు తీయగా అక్షర్ పటేల్, మహ్మద్ షమీ, కుల్‌దీప్ యాదవ్ తలో వికెట్ తీశారు.

## 2 పరుగులకే అవుటైన హిట్ మ్యాన్



టీమిండియా టెస్టు, వన్డే జట్ల సారథి రోహిత్ శర్మ గత కొంతకాలంగా ఫామ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఫామ్ లో లేని కారణంగా ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో ఓ మ్యాచ్‌కు అతడిని పక్కనబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాటింగ్ లో లయను అందిపుచ్చుకోవడం కోసం ఇటీవల రంజీ క్రికెట్ బరిలో దిగినా కథ మారలేదు. ఇప్పుడు ఇంగ్లండ్ తో తొలి వన్డేలోనూ రోహిత్ ది అదే తీరు! ఓపెనర్ గా బరిలో దిగిన రోహిత్ శర్మ 7 బంతులు ఎదుర్కొని కేవలం 2 పరుగులు చేశాడు. ఇంగ్లండ్ బౌలర్ సకిబ్ మహ్మద్ బౌలింగ్ లో ఫ్లిక్ షాట్ కొట్టబోయి లివింగ్ స్టన్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇంగ్లండ్ తో మూడు వన్డేల సిరీస్ లో మిగతా మ్యాచ్ ల్లోనూ రోహిత్ ఇదే విధంగా ఆడితే... ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి పరిస్థితి ఏమిటన్నది సందేహంగా మారింది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుం డగా... రోహిత్ శర్మ నాయకత్వంలో ఇప్పటికే భారత జట్టును ప్రకటించారు. వరుసగా విఫలమవుతున్న రోహిత్ శర్మ... ఓపెనర్ గా శుభారంభం ఇవ్వకపోతే ఆ ప్రభావం తర్వాత వచ్చే బ్యాటర్లపై పడుతుంది. నాగపూర్ లో జరుగుతున్న ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ మొదట బ్యాటింగ్ చేసింది. 47.4 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌట్ అయింది. 249 పరుగుల లక్ష్యఛేదనకు బరిలో దిగిన భారత జట్టు 21 ఓవర్లు ముగిసే సరికి 3 వికెట్లకు 143 పరుగులు చేసింది. శుభ్ మాన్ గిల్ 38, అక్షర్ పటేల్ 20 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రేయాస్ అయ్యర్ చకచకా 59 పరుగులు చేసి అవుటయ్యాడు. అయ్యర్ 36 బంతులు ఎదుర్కొని 9 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 22 బంతులాడి 15 పరుగులు చేసి ఆర్చర్ బౌలింగ్ లో అవుటయ్యాడు.

# విరాట్ కోహ్లీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆడతాడా?




2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు కీలక ఆటగాళ్ల గాయాలు భారత్‌కు ఆందోళనగా మారాయి. ఇంతకుముందే స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఇప్పుడు కీలక బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ జాబితాలో చేరారు. గురువారం నాగ్‌పూర్‌లో మొదలైన భారత్– ఇంగ్లాండ్ మొదటి వన్డేకి కోహ్లీ దూరమయ్యాడు. అతడు కుడి మోకాలి నొప్పితో బాధపడుతున్నట్లు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. అయితే కోహ్లీ గాయం తీవ్రతపై స్పష్టత లేదు. టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ అతడు త్వరగా కోలుకుంటాడని భావిస్తోంది. పాక్ వేదికగా ఫిబ్రవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ మొదలు కానుంది. ప్రస్తుతం భారత్ చివరి దశ సన్నాహాల్లో ఉంది. ఫిబ్రవరి 20 నుంచి దుబాయ్‌లో భారత్ మ్యాచ్‌లు జరుగుతాయి. కోహ్లీ మొదటి వన్డే ఆడటం లేదని టాస్ సమయంలో రోహిత్ చెప్పాడు. దురదృష్టవశాత్తూ, నిన్న రాత్రి తలెత్తిన కుడి మోకాలిలో సమస్యతో కోహ్లీ ఆడడం లేదని స్పష్టం చేశాడు. బోర్డ్? ఆఫ్? కంట్రోల్? ఫర్? క్రికెట్? ఇన్ ఇండియా–బీసీసీఐ కూడా కోహ్లీ అందుబాటులో లేడని ధృవీకరిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతకు మించి గాయం తీవ్రత, అందుబాటులోకి వచ్చే సమయం గురించి వెల్లడింలేదు. బుధవారం నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కోహ్లీ అసౌకర్యానికి గురైనట్లు సమాచారం. గురువారం మ్యాచ్‌కు ముందు కొన్ని షటిల్ స్ప్రింట్లు చేస్తున్నప్పుడు కోహ్లీ కుడి మోకాలికి పెద్ద పట్టీ ఉంది. కోహ్లీని టీమ్ ఫిజియో కమలేష్ జైన్ నిశితంగా పరిశీలిస్తుండటం కనిపించింది. ఇప్పటి వరకు కోహ్లీ స్కానింగ్ చేయించుకోలేదు. నేషనల్ క్రికెట్ అకాడమీ–%చీజూ%లో చెక్–అప్ కోసం బెంగళూరుకు వెళ్తాడా లేదా ఫిబ్రవరి 9న కటక్‌లో జరిగే రెండో వన్డేకు అందుబాటులోకి వస్తాడా? అనేది చూడాలి. సిరీస్‌లో చివరి మూడో వన్డే ఫిబ్రవరి 12న అహ్మదాబాద్‌లో జరుగుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ఇక కొన్ని వారాలే మిగిలి ఉంది. ఫిబ్రవరి 20న దుబాయ్‌లో బంగ్లాదేశ్‌తో మొదటి మ్యాచ్ ఆడుతుంది. అప్పటిలోగా విరాట్ కోహ్లీ కోలుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.'



## ఆసీస్‌కు షాక్ మీద షాక్..

### వన్డేలకు స్టార్ ఆల్‌రౌండర్ రిటైర్‌మెంట్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియా జట్టుకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ జట్టుకు దూరమయ్యాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా ఆడేది కష్టమేనని ఆ జట్టు కోచ్ మెక్‌డొనాల్డ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. దీంతో సారథిగా ట్రావిస్ హెడ్ లేదా స్టీవ్‌స్మిత్‌లో ఒకరు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈక్రమంలో ఆసీస్‌కు మరో షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్ వన్డేలకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని వెల్లడించాడు. ఇప్పటికే అతడు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన ఆసీస్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. అయితే, ఇందులో అతడు ఆడేది లేదు. అతడికి బదులు మరొకరికి అవకాశం దక్కనుంది. ఫిబ్రవరి 12లోగా ఈ మార్పులు చేసుకొనే వీలుంది. దీంతో ఆసీస్ క్రికెట్‌లో ఏం జరుగుతుందనే దానిపై చర్చ మొదలైంది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. మార్కస్ స్టొయినిస్ 2015లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. ఇప్పటివరకు 71 వన్డేలు, 74 అంతర్జాతీయ టీ20లు ఆడాడు. మొత్తం 2,700 పరుగులు, 93 వికెట్లు తీశాడు. స్టొయినిస్ భారత క్రికెట్ అభిమానులకూ సుపరిచితుడే. ఐపీఎల్‌లో 96 మ్యాచ్‌లు ఆడిన స్టొయినిస్ 1,866 పరుగులు, 43 వికెట్లు పడగొట్టాడు.

# ఆర్‌సీబీ జట్టుకు భారీ ఎదురుదెబ్బ

- ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ దూరం?
- ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమణ



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ 2025కి ముందు ఆ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్‌ను ఆర్‌సీబీ జట్టు అత్యంత ఖరీదైన బౌలర్‌గా చేసి రూ.12.50 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ, ఐపీఎల్ 2025కి ముందు, అతను గాయం కారణంగా శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించాడు. కానీ ఇప్పుడు ఈ బౌలర్ ఐపీఎల్ 2025 నుంచి కూడా తప్పుకోవచ్చని చెబుతున్నారు. ఈ ఆటగాడిని పొందడానికి జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌తో పోరాడింది. కానీ ఇప్పుడు గాయం, ఆ తర్వాత శస్త్రచికిత్స తర్వాత, ఈ ఆటగాడు 2025 సీజన్‌లో ఆడటం కష్టమని చెబుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించనున్న ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కూడా ఐపీఎల్ 2025లో ఆడే అవకాశం లేదని తెలుస్తోంది. పాట్ కమ్మిన్స్ చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటం అతనికి కష్టంగా అనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో, అతను ఛాంపియ న్స్ ట్రోఫీకి దూరంగా ఉంటే, ఈ బౌలర్ కూడా ఐపీఎల్‌కు దూరంగా ఉండవచ్చు. అయితే, ఇప్పటివరకు ఏదీ స్పష్టంగా తెలియలేదు. క్రికెట్. కామ్ ఆస్ట్రేలియా నివేదిక ప్రకారం, పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్ కోలుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. వారిద్దరూ పూర్తిగా ఫిట్ అయ్యే వరకు ఆడటం కష్టం. ఇటువంటి పరిస్థితిలో, వారిద్దరూ ఐపీఎల్‌లో కూడా పాల్గొనడం కష్టంగా అనిపిస్తుంది. కాలి గాయం కారణంగా హాజిల్‌వుడ్ బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ రెండవ అర్ధభాగానికి దూరమయ్యాడు. గాయం కారణంగా శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు కూడా అతను దూరంగా ఉన్నాడు. కానీ, ఇప్పుడు మరో గాయం అతన్ని బాధ పెడుతోంది. ఇంతలో, కామెరాన్ గ్రీన్ ఇప్పటికే 2025 ను కోల్పోతున్నానని ధృవీకరిం చాడు. మిచెల్ మార్ష్ కూడా గాయపడి ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఆడటం కష్టంగా అనిపిస్తుంది.



## ఛాంపియన్స్ ట్రోఫీకి కమిన్స్ దూరం..

### ఆసీస్ అధికారిక ప్రకటన

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియా జట్టుకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే స్టార్ ఆల్‌రౌండర్లు మిచెల్ మార్ష్, మార్కస్ స్టొయినిస్ జట్టుకు దూరమవ్వగా.. తాజాగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా ఈ టోర్నీకి అందుబాటులో ఉండటం లేదు. అతడితో పాటు ఫాస్ట్ బౌలర్ జోష్ హెజెల్‌వుడ్ కూడా దూరమయ్యాడు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా గురువారం అధికారికంగా ప్రకటించింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా గత నెల జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో ఈ నలుగురు ఆటగాళ్ల పేర్లను ప్రకటించింది. ఇందులో కమిన్స్, హేజెల్‌వుడ్, మార్ష్ గాయాలతో బాధపడుతున్నారు. దురదృష్టవశాత్తూ ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి వీరంతా గాయాల నుంచి కోలుకునే అవకాశం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ సెలెక్టర్ జార్జ్ బైలీ వెల్లడించారు. దీంతో ఈ ముగ్గురూ టోర్నీకి దూరమవుతున్నట్లు పేర్కొన్నారు. 'ఇది బాధాకర పరిణామమే అయినప్పటికీ.. ఇతర ఆటగాళ్లకు గొప్ప అవకాశం లాంటిది. అంతర్జాతీయ టోర్నమెంట్‌లో తమ ప్రతిభను నిరూపించుకునే సమయం" అని బైలీ తెలిపారు. కాగా.. ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్ నేడు వన్డేలకు వీడ్కోలు పలికాడు. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండడు. ఆసీస్ ప్రకటించిన జట్టులో అతడు సభ్యుడిగా ఉన్నప్పటికీ.. స్టొయినిస్ గురించి బైలీ ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. తాజా ప్రకటనతో ఆసీస్ తమ జట్టులో తప్పనిసరిగా నాలుగు మార్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీనిపై ఫిబ్రవరి 12 లోగా నిర్ణయం తీసుకోవాలి. దీంతో ఆసీస్ క్రికెట్‌లో ఏం జరుగుతుందనే దానిపై చర్చ మొదలైంది. కమిన్స్ లేకపోతే కెప్టెన్ పగ్గాలు ఎవరికిస్తారనేది ఆసక్తికరంగా మారింది. 2023లో వన్డే ప్రపంచకప్ సాధించిన ఆసీస్ జట్టుకు కమిన్స్ సారథిగా వ్యవహరించాడు. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది.



# నా ఫొటో ఉన్న టీ షర్ట్ వేసుకో.. ఖుషీకి జాన్వీ రిక్వెస్ట్

'లవ్‌యాపా' అంటూ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. "ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం రేపటి నుంచి అన్ని థియేటర్‌లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. ఎందుకంటే ఎమోషనల్ సీన్స్‌లలో నా ఖుషీ ఏడవడం బిగ్‌స్క్రీన్‌పై చూసినప్పుడు తట్టుకోలేను" అని రాసుకొచ్చారు. 'లవ్‌యాపా' స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు. 2023లో 'ది ఆర్చిస్'తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్. ఆ చిత్రంతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'లవ్‌యాపా' అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే'. నేటితరం యువతీ యువకుల ప్రేమకథతో దీనిని రూపొందించారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్‌యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

# పోషించే పాత్రలే మనమేంటో నిరూపిస్తాయి



తెరపై సూపర్ హీరోగా కనిపించాలనేది తన కోరికని అంటోంది కథా నాయిక పూజా హెగ్డే. ఇటీవలే 'దేవా' సినిమాతో జర్నలిస్టు దియా పాత్రలో ప్రేక్షకుల్ని పలకరించిందీ తార. ప్రస్తుతం ఈ సినిమాతో థియేటర్లలో సందడి చేస్తూనే.. మరోవైపు 'రెట్రో' చిత్రం కోసం సన్నద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజ.. ఇంకా నటించాల్సిన పాత్రలు చాలా ఉన్నాయంటూ కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "సినీ రంగంలోకి అడుగు పెట్టి దాదాపు దశాబ్దం గడిచింది. ఇన్నేళ్ల నా ప్రయాణంలో ఎన్నో విభిన్నమైన కథల్లో భాగమైనా.. నేను నటించాల్సిన పాత్రలు ఇంకా మిగిలే ఉన్నాయి. పూర్తిస్థాయిలో సాగే యాక్షన్ సినిమాలు, తండ్రీ కూతుళ్ల అనుబంధంతో తీర్చిదిద్దే కథల్లో, పిల్లల కోసం 'హ్యారీ పోటర్' లాంటి చిత్రాల్లో నటించాలనుకుంటున్నా. తెరపై సూపర్ హీరో పాత్ర పోషించాలనేది నా కెరీర్‌లో మరో ముఖ్యమైన కోరిక. ఎందుకంటే పోషించే పాత్రలే మనల్ని మరింత శక్తిమంతంగా చూపిస్తూ.. మనమేంటో నిరూపిస్తాయి. ఇలాంటి పాత్రలు నటీమణులకు చాలా అవసరం" అని చెప్పుకొచ్చింది.





# తెలుగు సినిమా దినోత్సవం

## ఏటా పండుగలా నిర్వహించాలని ఛాంబర్ నిర్ణయం

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీని తెలుగు సినిమా దినోత్సవంగా సెలబ్రేట్ చేయాలని, అలాగే ఛాంబర్ తరపున ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్రాలు, నటీనటులకు అవార్డులు, పద్మ ఇంకా ఇతర అవార్డులు పొందిన వారందరినీ సన్మానించాలనేలా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6ను తెలుగు సినిమా పుట్టిన రోజుగా ఇకపై గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయనున్నట్లుగా తెలుపుతూ.. ఆ రోజున ప్రతి నటీనటుడి ఇంటిపైన, అలాగే రాష్ట్రంలోని థియేటర్లపైనా జెండా ఎగురవేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొంది. ఈ మేరకు తెలుగు సినిమా పుట్టినరోజుకు సంబంధించిన జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ సినీ రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించినట్లు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రముఖులు పాల్గొని.. ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ఈ ఏడాది సింపుల్‌గా ప్రారంభించి, ప్రతి ఏడాది ఘనంగా చేయదలిచాము. గద్దర్ అవార్డ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం ప్రొ యాక్టివ్‌గా ఉంది. సినిమా ఇండస్ట్రీ గురించి, వ్యక్తుల గురించి తక్కువ చేసి మాట్లాడే వారిని ఎప్పటికప్పుడు ఛాంబర్ కట్టడి చేస్తూనే ఉంది. వివాదాస్పద కామెంట్స్ చేసే వారు తామెంటో కూడా చూసుకోవాలని సూచించారు. ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు అని నటుడు మురళీమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# 'లైగర్'.. నా కుమార్తె అసౌకర్యంగానే ఓకే చెప్పింది : నటి తండ్రి



విజయ్ దేవరకొండ, అనన్య పాండే జంటగా నటించిన చిత్రం 'లైగర్'. 2022లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఈ చిత్రాన్ని ఉద్దేశించి అనన్య తండ్రి చంకీ పాండే తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో యాక్ట్ చేయడం అనన్యకు ఏమాత్రం ఇష్టం లేదని, కాకపోతే తన వల్లే ఆమె ఇందులో నటించిందని అన్నారు. "అనన్యకు ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు తను ఎంతో అసౌకర్యంగా ఫీలైంది. గందరగోళానికి గురైంది. హీరోయిన్ పాత్రకు సెట్ కానని.. చిన్న పిల్లలా కనిపిస్తానని తను అనుకుంది. దాంతో నా వద్దకు వచ్చింది. "నాన్నా.. ఈ సినిమాకు నేను సెట్ కాననిపిస్తుంది. ఏం చేయమంటావు?" అని అడిగింది. అలా ఏమీ కాదని.. అదొక బిగ్ ప్రాజెక్ట్ కనుక సక్సెస్ అయితే పేరు వస్తుందని చెప్పి ఆమెను ఒప్పించాను. సినిమా విడుదలయ్యాక వచ్చిన విశ్లేషణలు చూసి.. తను చెప్పింది నిజమేననిపించింది. నిజంగానే ఆ పాత్రకు అనన్య చాలా యంగ్‌గా అనిపించింది. ఆ సినిమా తర్వాత నేను తనకు ఎప్పుడూ సలహాలు ఇవ్వలేదు. ప్రాజెక్ట్‌ల విషయంలో పూర్తి నిర్ణయం తనపైనే ఉంచాను. ప్రస్తుతం తనకు నచ్చిన ప్రాజెక్ట్‌లు ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకుసాగుతుంది" అని చంకీ పాండే తెలిపారు. విజయ్ దేవరకొండ నటించిన తొలి పాన్ ఇండియన్ మూవీగా 'లైగర్' విడుదలైంది. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించారు. రూ.150 కోట్ల బడ్జెట్‌తో దీనిని తీయగా.. రూ.60 కోట్లు మాత్రమే వసూళ్లు చేసినట్లు సినీ విశ్లేషకుల అంచనా. ఈ సినిమాలో యాక్ట్ చేయడం గురించి గతంలో అనన్య కూడా మాట్లాడారు. "నిర్మాత కరణ్‌జోహార్, నా తల్లిదండ్రులు చెప్పడం వల్లే 'లైగర్'ను ఓకే చేశాను. సాధారణంగా నా సినిమా రిలీజైన ప్రతిసారీ మా అమ్మ తన అభిప్రాయాన్ని చెబుతుంటారు. లైగర్‌కు జస్ట్ 'ఫన్!' అంటూ ఆమె రిప్లై ఇచ్చారు. నాకు వచ్చిన చెత్త రివ్యూ అదేననిపించింది. తప్పులు ప్రతిఒక్కరూ చేస్తారు. ఆ తప్పుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవాలని అర్థమైంది" అని అనన్య అన్నారు.

# బలగం వేణు.. ఎల్లమ్మకు సర్వం సిద్ధం



బలగం సినిమాతో దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగ్గి ÷నైల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండింగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.

# సాయిపల్లవి న్యాయం చేయగలదనే నమ్మకం

## అందుకే తండేల్‌లో ఆమెను ఎంపిక చేశా : అల్లు అరవింద్

నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి తెరకెక్కిస్తున్న చిత్రం 'తండేల్' ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ కు మంచి స్పందన లభిస్తోంది. దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన 'బుజ్జి తల్లి, శివ శక్తి, హైలెస్సో హైలెస్సా' పాటలు మ్యూజిక్ చార్టులలో టాప్ ప్లేస్‌లో, అలాగే యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచాయి. ఈ నేపథ్యంలో నిర్మాత అల్లు అరవింద్ హీరోయిన్ సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అల్లు అరవింద్ మాట్లాడుతూ..'ఈ చిత్రంలో సాయి పల్లవి ఎంపిక నా నిర్ణయమే. ఇది కమర్షియల్ నిర్ణయమని చెప్పాలి. ఈ పాత్ర కోసం నేను ముంబయి వెళ్లి ఎవరినీ తీసుకురాలేదు. ముంబయి నుంచి వచ్చిన వైట్ స్కిన్ అమ్మాయిలు ఈ పాత్రకు జీవం తీసుకు రాలేరనిపించింది. ఇది ఎన్నో భావోద్వేగాలతో కూడిన పాత్ర. ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతుంది. ఇలాంటి గొప్ప పాత్రను నిజాయతీగా చేయాలి. సాయిపల్లవి అయితే వందశాతం న్యాయం చేయగలదని నాకు అనిపించింది. ఆమె అసాధారణమైన నటి. అందుకే ఆమెను ఎంపిక చేశాం. మేము అనుకున్నట్లుగానే సాయిపల్లవి వందశాతం న్యాయం చేసింది' అన్నారు. ఇటీవల సాయిపల్లవికి విశ్రాంతి కావాలని వైద్యులు సూచించారు. ఆమె అనారోగ్యానికి గురయ్యారని దర్శకుడు చందు మొండేటి ముంబయిలో జరిగిన 'తండేల్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో చెప్పాడు. అందుకే ఆమె ఈవెంట్‌కి హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'సాయిపల్లవి కొన్ని రోజుల నుంచి జ్వరం, జలుబుతో బాధ పడుతున్నారు. అయినా సినిమాకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో ఆమె మరింత నీరసించారు. వైద్యులు ఆమెకు కనీసం రెండు రోజులు బెడ్ రెస్ట్ అవసరమని సూచించారు. అందుకే ఆమె ముంబయి వేదికగా జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొనలేకపోయారు' అని అన్నారు. కాగా, ఇప్పుడు ఆమె పూర్తిగా కోలుకొని తండేల్ ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటున్నారు.

# అందరిపై దయతో ఉండండి..

## రష్మిక తాజా పోస్ట్ వైరల్



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రష్మిక తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. తన సినిమా విశేషాలు పంచుకునే ఆమె తాజాగా దయగా ఉండండి అంటూ పోస్ట్ పెట్టారు. "ఈ రోజుల్లో అందరిలో దయ తగ్గిపోతోంది. నేను మాత్రం అందరినీ ఒకేలా చూస్తాను. మీరంతా కూడా అలానే ఉండండి. ఒకరిపై ఒకరు దయతో ఉండండి" అని రాసుకొచ్చారు. తాను ధరించిన టీ షర్ట్ మీద కూడా దయ అనే రాసి ఉంది. దీంతో ఈ పోస్ట్‌పై నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. తాజాగా రష్మిక, విజయ్ దేవరకొండ జిమ్‌లో కలిసి కనిపించిన వీడియో వైరలైన విషయం తెలిసిందే. అయితే, జిమ్‌లో నుంచి బయటకు వచ్చిన విజయ్ కారులో కూర్చోగా.. రష్మిక కాలికి ఉన్న గాయం కారణంగా ఇబ్బందిపడుతూ కారు ఎక్కారు. ఈ వీడియోపై కొందరు విజయ్‌ను విమర్శిస్తున్నారు. రష్మికకు సాయం చేయొచ్చు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక పోస్ట్ వైరల్‌గా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రష్మిక నటించిన ఛావా విడుదలకు సిద్ధమైంది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితాధారంగా రూపొందుతున్న చిత్రమే 'ఛావా'. శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన భార్య పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్'లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఇది రానుంది. అలాగే వీటితో పాటు 'థామ', 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతోనూ రష్మిక బిజీగా ఉన్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463